సంపుటి : 9
సంచిక : 359
సోమవారం
21 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

## వినాయక నిమజ్జన వేడుకల్లో పెరుగుతున్న విషాదాలు

# ఊపిరి తీస్తున్న 'మోత'

## డీజే ధ్వనుల హోరు.. సత్తువ కోల్పోతున్న గుండెలు




- ఏపీ, తెలంగాణల్లో నిమజ్జనోత్సవాల వేళ వరుస విషాదాలు
- డ్యాన్స్ చేస్తూ పలువురు అస్వస్థత .. కొన్ని చోట్ల ఆకస్మిక మరణాలు
- శబ్ధ పరిమితుల అమలుపై ప్రశ్నలు.. పర్యవేక్షణ ఎక్కడ?

(అమరావతి, విశ్వం వాయిస్ ప్రతినిధి – ప్రత్యేక కథనం)

ఆనందోత్సవాల మధ్య సాగాల్సిన వినాయక నిమజ్జన వేడుకలు కొన్ని చోట్ల విషాదానికి వేదికవుతున్నాయి. డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్‌లతో సాగుతున్న ఊరేగింపుల్లో కొందరు తీవ్ర అస్వస్థతకు గురవడం, మరికొందరు ఆకస్మికంగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ప్రతి మరణానికీ డీజే శబ్దమే ప్రత్యక్ష కారణమని నిర్ధారించడానికి వైద్య పరీక్షలు, పోస్టుమార్టం లేదా ఇతర అధికారిక ఆధారాలు అవసరం. అందువల్ల ఇటువంటి ఘటనలను 'డీజే వల్ల మరణం'గా తేల్చడం కంటే, డీజే శబ్దం, తీవ్రమైన శారీరక శ్రమ, గుంపులో ఒత్తిడి, ముందస్తు గుండె సంబంధిత సమస్యలు తదితర అంశాలపై వైద్యపరమైన దర్యాప్తు అవసరం.

### నిమజ్జన వేడుకల్లో వరుస విషాదాలు

2026 వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ఊరేగింపులు, డీజే సంగీతం, నృత్యాల సమయంలో వ్యక్తులు అస్వస్థతకు గురై మరణించినట్లు పలు ఘటనలు వెలుగులోకి వచ్చాయి.

**తాడేపల్లిగూడెం:** నిమజ్జన శోభాయాత్రలో డీజే పాటలకు డ్యాన్స్ చేస్తుండగా కాకర్లమూడి ఏసు (48) అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందినట్లు సమాచారం.

**సోమందేపల్లి:** గణేష్ నిమజ్జన ఊరేగింపులో డీజే సంగీతానికి డ్యాన్స్ చేస్తుండగా శ్రీకాంత్ అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు సమాచారం.

**తాండ్రపాడు:** నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న శివమ్మ (36) అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందినట్లు సమాచారం.

**డోన్:** గణేష్ గౌడ్ (23) నిమజ్జన ఊరేగింపులో పాల్గొని డీజే వద్ద నృత్యం చేసిన అనంతరం ఇంటికి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలపై స్థానిక పోలీసు, వైద్య అధికారుల అధికారిక నివేదికలు అందుబాటులోకి వచ్చిన తర్వాతే మరణానికి ఖచ్చితమైన కారణాన్ని నిర్ధారించాల్సి ఉంటుంది.

### డీజే మోత.. ఆరోగ్యంపై ప్రభావం ఎంత?

అధిక శబ్దం కేవలం చెవులకే ప్రమాదం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంటోంది. అధిక శబ్దానికి గురికావడం వల్ల ఒత్తిడి, నిద్రాభంగం, వినికిడి సమస్యలతో పాటు హృదయ సంబంధిత సమస్యల ప్రమాదం పెరగవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. అధిక శబ్దం శరీరంలో ఒత్తిడి ప్రతిస్పందనలను ప్రేరేపించి రక్తపోటు, గుండె స్పందన వంటి అంశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సంబంధిత సాంకేతిక పత్రాలు వివరిస్తున్నాయి. అయితే "100–120 డెసిబెల్స్ శబ్దం వినగానే గుండె ఆగిపోతుంది" లేదా "బేస్ శబ్దం నేరుగా కార్డియాక్ అరెస్ట్‌కు కారణమవుతుంది" అనే సాధారణీకరణలను వైద్య ఆధారం లేకుండా ప్రచురించడం సరికాదు.

### నిబంధనలు ఏం చెబుతున్నాయి?

భారతదేశంలోని నాయిస్ పొల్యూషన్ (రెగ్యులేషన్ అండ్ కంట్రోల్) రూల్స్, 2000 ప్రకారం లౌడ్‌స్పీకర్ లేదా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ వినియోగానికి సాధారణంగా లిఖితపూర్వక అనుమతి అవసరం. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగంపై సాధారణ పరిమితి ఉంది. అయితే సాంస్కృతిక, మతపరమైన పండుగల సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట షరతులతో పరిమిత మినహాయింపులు ఇవ్వగలదు. అందువల్ల అనుమతి ఉందన్న కారణంతో శబ్ద పరిమితులన్నింటినీ అధిగమించే స్వేచ్ఛ లభించదు. అనుమతుల్లో విధించిన షరతులు, ప్రాంతానికి వర్తించే శబ్ద ప్రమాణాలు, సమయ పరిమితులు తప్పనిసరిగా పాటించాల్సిందే.

### పర్యవేక్షణ ఎక్కడ?

నిమజ్జన శోభాయాత్రల్లో భారీ సౌండ్ సిస్టమ్‌లు ఉపయోగిస్తున్నప్పుడు శబ్ద స్థాయిని కొలిచే పరికరాలతో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనుమతుల్లో పేర్కొన్న పరిమితులను ఉల్లంఘిస్తున్న డీజే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. ప్రత్యేకించి ఆసుపత్రులు, పాఠశాలలు, వృద్ధులు మరియు అనారోగ్యంతో ఉన్నవారు నివసించే ప్రాంతాల్లో అధిక శబ్దాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

### ఏం చేయాలి?

**సౌండ్ లిమిటర్ల వినియోగం:** అనుమతులు ఇచ్చే సమయంలోనే నిర్దిష్ట శబ్ద పరిమితిని మించకుండా సాంకేతిక నియంత్రణలు విధించాలి.

**డెసిబెల్ తనిఖీలు:** నిమజ్జన మార్గాల్లో అధికారుల వద్ద కాలిబ్రేటెడ్ సౌండ్ లెవల్ మీటర్లు ఉండాలి.

**ఉల్లంఘనలపై చర్యలు:** అనుమతి నిబంధనలు ఉల్లంఘించిన పరికరాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

**సైలెన్స్ జోన్ల రక్షణ:** ఆసుపత్రులు తదితర సున్నిత ప్రాంతాల వద్ద శబ్ద నియంత్రణను కఠినంగా అమలు చేయాలి.




**ప్రజల అప్రమత్తత:** భారీ సౌండ్ బాక్సులకు అత్యంత సమీపంలో ఎక్కువసేపు ఉండకపోవడం, తీవ్రమైన శారీరక శ్రమను నిరంతరం చేయకపోవడం, ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం అవసరం.

### ఉత్సవం ఉండాలి.. ఉనికి కూడా ఉండాలి

వినాయక నిమజ్జనం భక్తి, ఆనందం, సామూహిక ఉత్సవానికి ప్రతీక. డీజే సంగీతం, నృత్యాలు కూడా వేడుకలో భాగమయ్యాయి. కానీ ఉత్సవం ఉల్లాసంగా సాగాలంటే శబ్ద పరిమితులు, భద్రతా నిబంధనలు, వైద్య అత్యవసర సేవలు, పోలీసు పర్యవేక్షణ సమాంతరంగా ఉండాలి.

*మోత పెరగడం కాదు.. మమకారం పెరగాలి.*
*ఉత్సవం ముగిసే సరికి జ్ఞాపకాలు మిగలాలి.. విషాదాలు కాదు.*

---

### ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే

# దేశంలోనే నెం.1గా ఎపి విద్యావ్యవస్థ!



- క్లాస్ రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యం... అందుకే విద్యాశాఖ ఎంచుకున్నా
- సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదుగుదాం
- దేశభక్తి, నైతిక విలువలే మన కుటుంబ వ్యవస్థకు పునాది
- త్యాగధనులే మన మార్గదర్శకులు.. వారి బాటలో పయనిద్దాం
- విలువలతో ఎదగండి.. తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవండి
- చిన్నచిన్న సమస్యలకే కుంగిపోవద్దు... ఎదురొడ్డి పోరాడాలి
- భారతీయం కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

కాకినాడ రూరల్, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ : భారతదేశ చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ర్యాంక్స్ తెచ్చుకున్న పిల్లల ఫోటోలతో పత్రికలు, టీవీల్లో అడ్వర్టైజ్మెంట్ ఇచ్చాం. ఈ ఏడాది 1.10 లక్షల మంది స్టూడెంట్స్ ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇంటర్ లో కూడా 10 వేల అడ్మిషన్స్ పెరిగాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల సహకారంతోనే ఈ ఫలితాలు సాధించాం. దీనికి నైతిక విలువలు కూడా తోడైతే మన ఎపి మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే నెం.1గా మారుతుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో భారతీయం పేరుతో పాఠశాల విద్యాశాఖ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యాన భారతీయం పేరుతో నిర్వహించిన దేశభక్తి కార్యక్రమానికి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మిగతా .. 2లో..

---

# ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి
- ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి
- అభివృద్ధి ఆగకూడదు... పర్యావరణానికి గాయం చేయకూడదు
- బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ది ఎర్త్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు



బెంగళూరు, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ : ప్రకృతికి ప్రాధాన్యమిస్తూ, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో నిర్మించిన ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి సీఎం చంద్రబాబు ది ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను రూపొందించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, వంటి అంశాలకు ఈ భవనంలో రీ-సైకిల్ చేసిన పదార్థాల వినియోగం ప్రాధాన్యం మిగతా .. 2లో..

---

### ఏపీలో దసరా సెలవులు

# అక్టోబర్ 12 నుండి 21 వరకు

**అక్టోబర్ 10 రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం దాంతో ముందే ప్రారంభం కానున్న సెలవుల సందడి**



అమరావతి, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది దసరా సెలవులు కాస్త ముందుగానే రానున్నాయి. అధికారికంగా ప్రకటించిన సెలవులకు ముందు రెండో శనివారం, ఆదివారం రావడంతో విద్యార్థులకు మరో రెండు రోజులు అదనంగా కలిసొచ్చాయి. దీంతో పండగ వాతావరణం ముందుగానే మొదలుకానుంది. రాష్ట్ర విద్యాశాఖ మిగతా .. 2లో..

---

### గజ వాహనంపై

# అభయమిచ్చిన శ్రీ మలయప్ప స్వామి



తిరుమల, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ : కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆరో రోజైన ఆదివారం రాత్రి శ్రీ మలయప్ప స్వామివారు గజ వాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు గంభీరంగా నడుస్తుండగా.. మంగళవాయిద్యాల నడుమ, భక్తజనుల గోవింద నామస్మరణతో తిరుమాడ వీధులు మిగతా .. 2లో..

---

### విదేశాంగ శాఖ మంత్రి

# జైశంకర్‌కు 'సర్' నోటీసులు



దిల్లీ, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల సంఘం నోటీసులిస్తోంది. ఇప్పటికే దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద ఈ నోటీసులు మిగతా .. 2లో..

---

# ఆ కట్టడాన్ని.. సైనిక కాంప్లెక్స్‌గానూ తీర్చిదిద్దుతాం

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ : దేశ రాజధాని వాషింగ్టన్ డీసీలో ఓ భారీ విజయ తోరణాన్ని నిర్మించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికలు రచిస్తున్న విషయం తెలిసిందే. ఈ కట్టడం విషయంలో తాజాగా ఆయన కీలక ప్రకటన చేశారు. డ్రోన్లు, స్నైపర్‌లను మోహరించడంతోపాటు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే

# దేశంలోనే నెం.1గా ఎపి విద్యావ్యవస్థ!

మాట్లాడుతూ చాగంటి గారి ప్రవచనం వినపడని ఇల్లు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉండదు. చాగంటి గారిని ఎప్పుడు కలిసినా ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. 'భారతీయం' అనే గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గురువు గారికి ధన్యవాదాలు. నాది భారతదేశం...నేను భారతీయుడిని. మన భారతదేశం... మన గౌరవం, మన సనాతన ధర్మం మన బలం. నైతిక విలువలకు పుట్టినిల్లు మన దేశం. మానవత్వం మన వారసత్వం. నైతిక విలువలే కుటుంబ వ్యవస్థ మన పునాది. వైద్యంలో చరకుడు, రాజనీతిలో చాణుక్యుడు, గణితంలో ఆర్యభట్ట, యోగాలో పతంజలి, ఆయుర్వేదంలో ధన్వంతరి పురాతన కాలంలోనే భారతీయుల సత్తా ప్రపంచానికి చూపించారని అన్నారు.

**నైతిక విలువలవల్లే భారతీయులంటే గౌరవం**

"ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు అంటే గౌరవంగా చూస్తారు. అదే పెద్దవాళ్లు మనకు ఇచ్చిన ఆస్తి. విలువలతో కూడిన సమాజం, కుటుంబ వ్యవస్థ. యూనిటీ ఇన్ డైవర్సిటీ ఈజ్ ద స్ట్రెంత్ ఆఫ్ అవర్ నేషన్. ఇంత గొప్ప ఆస్తిని కాపాడుకోవడమే కాదు భావి తరాలకు అందించాలి. అందుకే నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నాం. నైతిక విలువలు అనగానే గుర్తొచ్చే మొదటి పేరు చాగంటి కోటేశ్వరరావు గారు. అందుకే మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఆయనను నైతిక విలువల సలహాదారుగా నియమించారు. ఆయన రూపొందించిన పుస్తకాలు విద్యార్థులకు అందిస్తున్నాం. చిన్నతనం నుండే పెద్దలను, మహిళలను గౌరవించడం నేర్పిస్తున్నాం. గెలుపు – ఓటమి రెండింటినీ సమానంగా తీసుకునేలా తయారుచేయడమే లక్ష్యం. 6 ఏళ్ల లోపే పిల్లల్లో 90% బ్రెయిన్ డెవలప్ అవుతుంది. ఆ స్టేజ్ లోనే పిల్లలకు చదువు, గేమ్స్ తో పాటు నైతిక విలువలు కూడా నేర్పించాలి. అప్పుడే మనం దేశానికి బెస్ట్ సిటిజన్స్ ని అందించగలం" అని అన్నారు.

**సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యం**

సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని నమ్మి విద్యాశాఖ ఎంచుకున్నా. చాగంటి గారి ద్వారా విలువల విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలి. బాపట్ల మొదటి పిటిఎంలో పిల్లలకు పెట్టే భోజనమే ముఖ్యమంత్రి తిన్నారు, క్వాలిటీ పెంచాలని చెప్పారు. సమాజంలో మార్పు క్లాస్ రూం నుంచే ప్రారంభం అవుతుంది. క్షణికావేశంతో తీసుకునే నిర్ణయాలు విధ్వంసానికి దారి తీస్తాయి. నేను అమెరికా స్టాన్ఫోర్డ్ లో చదివాను. రెండేళ్ల ఎంబీఏ పరీక్షల్లో ఎప్పుడూ ఇన్విజిలేటర్లను చూడలేదు. ఆ రకమైన క్రమశిక్షణ మనవద్ద కూడా రావాలి. ప్రపంచంలో ఎన్నో దేశాలు తమ దేశ అభ్యున్నతికి రెండుతరాలు కష్టపడ్డాయి. ఒకపుడు మత్స్యకార గ్రామం సింగపూర్ అలాగే అభివృద్ధి చెందింది. ప్రధాని మోదీ నేతృత్వంలో ఇప్పుడు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. నమ్మిన సిద్ధాంతాలు సాధించే వరకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి. మన రాష్ట్రం ఈ స్థాయికి రావడం వెనుక ఎంతో మంది కష్టం దాగి ఉంది. దేశ సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులు లేకపోతే ఇప్పుడు మనం ప్రశాంతంగా ఉండేవారం కాదు. సైనికులు కనపడితే విద్యార్థులు సెల్యూట్ కొట్టండి. ఒక్కొక్కరికి దేవుడు ఒక్కో పరీక్ష పెడతాడు, ఎదుర్కొనే శక్తి కూడా ఇస్తాడు. మార్కులు తక్కువ వచ్చాయని, ఇప్పటికిపుడు సాధించ లేపోయామని ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయం తీసుకోవద్దు. నేను ఈ స్థాయికి చేరడం వెనుక నా తల్లి కష్టం, త్యాగం ఉన్నాయి. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల త్యాగం వల్లే మనం ఉన్నత స్థానాలకు చేరుకుంటాం. నైతిక విలువలు, అమ్మప్రేమ ఉన్న పుణ్యభూమి మన భారత దేశం.

**రాజకీయాలకు దూరంగా విద్యావ్యవస్థ**

అందరూ వద్దన్నా విద్యా శాఖను ఛాలెంజ్ గా తీసుకున్నా. గడిచిన రెండేళ్లలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడం టార్గెట్ గా పెట్టుకున్నాం. చిన్నపిల్లల మనసు చాలా సున్నితంగా ఉంటుంది. అందుకే నేను మంత్రి అయిన వెంటనే తీసుకున్న మొదటి నిర్ణయం నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్. యూనిఫాం, బుక్స్, బ్యాగ్స్, బెల్ట్స్, షూస్ ఎక్కడా నో పొలిటికల్ పార్టీ కలర్స్. ఎక్కడా ముఖ్యమంత్రి, నా ఫోటో ముద్రించలేదు.

**నైతిక విలువలతో ప్రపంచ విజేతలమవుతాం**

అటమిక్ ఎనర్జీతో విద్యుత్ వెలుగులు ఇవ్వొచ్చు. అదే ఆటమ్ బాంబ్ విధ్వంసం కూడా చేస్తుంది. ఒక మొక్క నాటిన తర్వాత పెద్ద చెట్టు అవ్వాలంటే సంవత్సరాలు పడుతుంది. ఆ చెట్టు నీడ ఇస్తుంది, కాయలు ఇస్తుంది. అదే చెట్టుని 5 నిమిషాల్లో కొట్టేయొచ్చు. అదే నిర్మాణం – విధ్వంసం మధ్య తేడా. పిల్లల్లో ఆలోచనా శక్తి పెరిగేలా చేయడమే నైతిక విలువల లక్ష్యం. ఏది మంచి – ఏది చెడు తెలిసేలా చేయాలి. మనం ాూ×, రోబోటిక్స్ గురించి మాట్లాడుతున్నాం. వాటికి భారతీయం నైతిక విలువలు తోడవ్వాలి. అప్పుడే మనం ప్రపంచ విజేతలం అవుతాం. గురువు గారు చాగంటి కోటేశ్వరరావు గారు పిల్లలకు చెప్పిన ఒక మాట నాకు బాగా గుర్తుండిపోయింది. అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అని ఆయన అన్నారు. నేను ఎక్కడికి వెళ్లినా ఈ మాట చెబుతున్నాను. వినడానికి చాలా సింపుల్ గా ఉంది, కానీ అర్థం చేసుకుంటే చాలా పవర్ ఫుల్ మెసేజ్ ఉంది. ఇదే మన భారతీయం – అమ్మ గొప్పతనం. ఎప్పుడూ తప్పు చేయకూడదు అనే గొప్ప పాఠం.

**త్యాగధనుల స్ఫూర్తే మనకు మార్గదర్శకం**

కష్టపడి చదివారు. విలువలతో పెరిగారు. గొప్ప పదవులు పొందారు. దేశం కోసం అన్నీ త్యాగం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు కూడా లెక్కచేయలేదు. అటువంటి వారి త్యాగాలు గుర్తు చేసుకోవడం మన బాధ్యత. దేశ భక్తికి, గుండె ధైర్యానికి మానవ రూపం టంగుటూరి ప్రకాశం పంతులు. 1928 లో సైమన్ గో బ్యాక్ అంటూ ఉద్యమం చేశారు. బ్రిటిష్ వాళ్లు కాల్చేస్తాం అని బెదిరించారు. ఆయన భయపడలేదు... గుండెను చూపించి ధైర్యం ఉంటే కాల్చండి అని సింహంలా గర్జించారు. అందుకే ఆయనకు ఆంధ్రకేసరి అనే బిరుదు వచ్చింది. మద్రాస్ రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించారు పొట్టి శ్రీరాములు గారు. 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారు. ఆయన త్యాగం వలనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది.

**దేశం కోసం పోరాడిన సైనికులే నిజమైన హీరోలు**

మనం సినిమాలు చూస్తాం. అందులో ఫైట్స్, డాన్సులు చూసి హీరోలు అంటాం. కానీ నిజమైన హీరోలు మన సైనికులు. మన భారతీయం వేదిక పై అటువంటి హీరో ఉన్నారు. కార్గిల్ యుద్ధ వీరుడు డి. కిరణ్ కుమార్ గారు. బోర్డర్ లో శత్రువులతో పోరాడారు. బాడీలో బుల్లెట్స్ దిగాయి. కంటి చూపు పోయింది. అయినా వెనక్కి తగ్గకుండా పోరాడారు. ఇప్పటికీ ఆయన బాడీలో బుల్లెట్ ఉంది. ఆయన దేశ భక్తి గెలిచింది – బుల్లెట్ ఓడిపోయింది. మరో ఉదాహరణ ఆర్మీ జవాన్ మురళీ నాయక్. ఆపరేషన్ సిందూర్ టైం లో చనిపోయారు. నేను సత్యసాయి జిల్లాలో ఉన్న మురళీ నాయక్ ఇంటికి వెళ్లి, ఆయన తల్లిదండ్రులను కలిశాను. చిన్నప్పటి నుండి మురళీ నాయక్ కి ఆర్మీలో జాయిన్ కావాలని కోరిక. వాళ్ల ఇంట్లో ఒప్పుకోలేదు. వాళ్ల అమ్మ, నాన్న ఒక్కటే అన్నారు. నీకు ఏమైనా అయితే మేము ఏం కావాలని అడిగారు. నేను యుద్ధంలో చనిపోతే దేశం మొత్తం మీ కోసం నిలబడుతుంది అని మురళీ నాయక్ చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు. మురళీ నాయక్ చెప్పినట్టే దేశం కోసం ఆయన ప్రాణ త్యాగం చేశాడు. దేశం మొత్తం ఆ కుటుంబానికి అండగా నిలిచింది. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మురళీ నాయక్ లాంటి వారు మన హీరోలు. వారి త్యాగాలను గౌరవించడం, స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**విజయానికి షార్ట్‌కట్ లేదు...**

సక్సెస్ కి షార్ట్ కట్స్ ఉండవు. హార్డ్ వర్క్ తోనే మనం మంచి పొజిషన్ కి వెళ్లగలం. అందుకు నేనే ఒక ఉదాహరణ. కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ, స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. ప్రజలకు సేవ చేయాలి అనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. 2019 లో పోటీ చేసి ఓడిపోయాను. తొలిసారి ఫెయిల్ అయ్యాను. డిసపాయింట్ అవ్వలేదు. ఖీూ×ూ అంటే ఖీఅతీర్ాౌవఎజ్ ×అ ాముఖతీఅఅఅస్త్ర అనుకున్నాను. 5 ఏళ్లు కష్టపడి ప్రజలకు దగ్గరయ్యాను. కట్ చేస్తే 2024 లో స్టేట్ లోనే 3వ అతిపెద్ద మెజారిటీతో గెలిచాను. చాలా మంది మంగళగిరి టీడీపీ సీట్ కాదు. టీడీపీకి కంచుకోట లాంటి సీట్లకి వెళ్లండి అని సలహా ఇచ్చారు. నథింగ్ డూయింగ్ నేను పడిపోయిన చోటే నిలబడతా అని ఛాలెంజ్ చేశాను. చేసి చూపించాను. రోడ్ లెస్ ట్రావెల్ చేసినపుడే విజయం వరిస్తుంది.

**సమస్యలకు ఎదురొడ్డి పోరాడండి...**

ఈమధ్య జరుగుతున్న కొన్ని సంఘటనలు చూస్తుంటే నాకు చాలా బాధ వస్తుంది. జులై 24 న మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించుకున్నాం. మన ముఖ్యమంత్రి గారు రంపచోడవరం లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం అద్భుతంగా జరిగింది. ఆ ప్రోగ్రాంలో శివాని అనే 10వ క్లాస్ స్టూడెంట్ మాట్లాడింది. చాలా అద్భుతంగా మాట్లాడింది.వేరే విద్యార్థి షైనింగ్ స్టార్ అవ్వడం చూసి తను కూడా షైనింగ్ స్టార్ అవ్వాలని కష్టపడి చదివింది. స్పీచ్ అయ్యాక నేను ముఖ్యమంత్రి గారి దగ్గరికి తీసుకెళ్లి ఫోటో కూడా తీయించాను. ఆ కార్యక్రమం తర్వాత రెండు రోజులకే శివాని ఆత్మహత్య చేసుకుంది. నేను చాలా బాధపడ్డాను.ఇంట్లో ఏదో సమస్య ఉందని శివాని ఆత్మహత్య చేసుకుంది. దేవుడు మనకి పరీక్ష పెడతాడు... ఆ పరీక్ష ఎదుర్కొనే శక్తి కూడా మనకి ఇస్తాడు. చిన్న చిన్న సమస్యల కోసం అటువంటి నిర్ణయం తీసుకోవడం కరెక్ట్ కాదు. ఇంట్లో చెప్పుకోలేని సమస్య ఏదైనా ఉంటే మీ టీచర్ కి చెప్పండి. వాళ్లు మీకు సహాయం చేస్తారు.

**తల్లిదండ్రులను గర్వపడేలా ఎదగండి**

తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వారు తలదించుకునేలా ఎప్పుడూ ప్రవర్తించవద్దు. వారు తల ఎత్తుకునేలా చేయండి. మీకు నచ్చిన రంగంలో ఎదగండి. ఆటలు, పాటలు, చదువు ఏదైనా పర్వాలేదు కానీ కష్టపడండి. ఊరికే గొప్ప వారు అవ్వరు. గురువర్యులు చాగంటి కోటేశ్వరరావు గారిని చూడండి. ఆయన నిత్య విద్యార్థి. ఎప్పుడూ ఖాళీగా ఉండరు. ఒక ఊరు నుండి ఇంకో ఊరు వెళ్లేటప్పుడు కూడా పుస్తకాలు చదువుతూ ఉంటారు. దేశ భక్తి – దైవ భక్తి – పెద్దలు అంటే గౌరవం – మహిళలను గౌరవించడం. సమాజం పట్ల బాధ్యత. ఇవన్నీ ఉంటే మీరు విజేతలు అవుతారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారు కోరుకున్నట్టు వికసిత్ భారత్, మన ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుకున్నట్టు స్వర్ణాంధ్ర మీతోనే సాధ్యం. ఫైనల్ గా ఒక్కటి చెబుతాను, తల్లిదండ్రులను ఎంత ప్రేమిస్తామో భారతదేశాన్ని అంత ప్రేమించాలి" అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

# ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

ఇచ్చారు. ఈ భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వనరులను అధికంగా వినియోగించే భవనాలు కాకుండా.. వనరులను తెలివిగా వినియోగించేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి ఆగకుండా... పర్యావరణానికి గాయం చేయకుండా వినూత్న ఆలోచనలతో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**పర్యావరణ సమస్యలను ఇప్పటికే ఎదుర్కొంటున్నాం**

వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని.. ఇప్పటికే మన ముందున్న సవాలని సీఎం అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. భవన నిర్మాణాల్లో నెట్‌జీరో విధానాన్ని అవలంభించాలని, సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతో పాటు రీ–యూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వీటితోనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించగలమన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని చంద్రబాబు చెప్పారు. ఇలాంటి పర్యావరణ హిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రజల అవసరాలను తీర్చే క్రమంలో ప్రకృతి పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పుడు నిర్మించే భవనాలే రాబోయే దశాబ్దాల్లో నగరాల వాతావరణాన్ని నిర్దేశిస్తాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని సీఎం పేర్కొన్నారు. ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమన్నారు. స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు.. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు.. ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చవచ్చు అని ముఖ్యమంత్రి అన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనని చెప్పారు.

**వ్యవసాయంలోనే కాదు... అభివృద్ధిలోనూ ప్రకృతికే ప్రాధాన్యతివ్వాలి**

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, అదే స్ఫూర్తి పట్టణాభివృద్ధిలోనూ అవసరమని సీఎం అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్–ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. అమరావతిని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దేవుడు ఇచ్చారని చెప్పారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను గుర్తిస్తూ... పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఈ ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచనేని, ప్రవీణ్ కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని ముఖ్యమంత్రి అభినందించారు.

### ఏపీలో దసరా సెలవులు

# అక్టోబర్ 12 నుండి 21 వరకు

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, 2026 సంవత్సరానికి గాను అక్టోబర్ 12 నుంచి 21వ తేదీ వరకు, మొత్తం 10 రోజుల పాటు దసరా సెలవులను అధికారికంగా ప్రకటించారు. అయితే, దీనికి ముందుగా అక్టోబర్ 10వ తేదీ రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం కావడంతో ఆ రెండు రోజులు కూడా సెలవుల్లో కలిసిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. మొత్తం మీద 12 రోజుల పాటు విరామం లభించనుంది. సెలవుల అనంతరం అక్టోబర్ 22వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక పొరుగు రాష్ట్రమైన తెలంగాణ విషయానికొస్తే, అక్కడ విద్యార్థులకు 13 రోజుల పాటు దసరా సెలవులు లభించనున్నాయి. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తిరిగి అక్టోబర్ 23న తరగతులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది విజయదశమి పండగ అక్టోబర్ 20వ తేదీ, మంగళవారం వచ్చింది. తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలు అక్టోబర్ 18న జరగనున్నాయి.

### గజ వాహనంపై

# అభయమిచ్చిన శ్రీ మలయప్ప స్వామి

భక్తిపారవశ్యంతో మార్మోగాయి. భక్తబృందాలు భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ ఆధ్యాత్మిక సందడి నెలకొల్పాయి. జీయ్యంగార్ల ప్రబంధ పారాయణంతో వాహనసేవ మరింత వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ శ్రీ మలయప్ప స్వామివారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# జైశంకర్‌కు 'సర్' నోటీసులు

జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్ఐఆర్–2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్‌బాగ్‌లో ఓటు హక్కు ఉంది. మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్‌కు కూడా 'సర్' నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది.

## ఆ కట్టడాన్ని.. సైనిక కాంప్లెక్స్‌గానూ తీర్చిదిద్దుతాం

మందుగుండు సామగ్రిని సైతం నిల్వ చేసే సైనిక కాంప్లెక్స్‌గానూ ఈ కట్టడాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. "ప్రపంచంలోని 59 అగ్ర నగరాలు, రాజధానుల్లో.. ఒక్క వాషింగ్టన్ డీసీలోనే విజయ తోరణం లేదు. కానీ, ఇప్పుడు అన్నింటికన్నా గొప్ప కట్టడాన్ని నిర్మిస్తాం. సైన్యం అభ్యర్థన మేరకు, దేశ భద్రత ప్రయోజనాల దృష్ట్యా.. ప్రతిపాదిత 250 అడుగుల ఎత్తయిన ఈ నిర్మాణాన్ని అత్యున్నత శ్రేణి సైనిక సముదాయంగానూ మార్చేందుకు అంగీకరించాను. పెద్దసంఖ్యలో డ్రోన్లు, స్నైపర్‌లను మోహరించేందుకు, అదేవిధంగా మందుగుండు సామగ్రిని నిల్వ ఉంచేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దుతాం" అని ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఆర్లింగ్టన్ మెమోరియల్ బ్రిడ్జికి ఆనుకుని ఉన్న రిసెప్టివ్ సర్కిల్ వద్ద ఈ తోరణాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. వాషింగ్టన్ డీసీపై తన శాశ్వత ముద్ర వేసేందుకు ట్రంప్ చేపడుతున్న అనేక ప్రాజెక్టుల్లో ఇదీ ఒకటి. వైట్ హౌస్ బాల్‌రూమ్, లింకన్ మెమోరియల్ రిఫ్లెక్టింగ్ పూల్ పునరుద్ధరణ, ఈస్ట్ పొటోమాక్ పార్క్‌లో గోల్ఫ్ కోర్సు పునర్నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి.

# ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు.. ఆ ఇద్దరికీ కూడా పోస్టింగ్

**రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం - సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా జయలక్ష్మికి నియామకం**
**ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఐజీగా కాంతి రాణాకు పోస్టింగ్ - విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు**
**పల్నాడు, మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త ఎస్పీలు - తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాలు**

**అమరావతి, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు 9 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలతో పాటు, మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. వివరాల్లోకి వెళితే, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్న సి.హెచ్. త్రివిక్రమ్ వర్మను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డైరెక్టర్‌గా నియమించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వేస్ ఐజీగా నియమిస్తూ, సీఐడీ మహిళా భద్రత విభాగం ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెండైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది. దాంతో వారి పోస్టింగ్ కు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు అధికారులకు తాజా బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ ఐజీగా కీలక బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా, పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అధికారి విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు అప్పగించారు.

**గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబుజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేశారు.**

జిల్లా స్థాయిల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఓఎస్డీగా ఉన్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కె. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఇక సీఎం సెక్యూరిటీ గ్రూప్ (సీఎంఎస్‌జీ) ఎస్పీగా ఉన్న జగదీశ్ అడహళ్లికి పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల బలోపేతం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

### ఏపీలో సచివాలయ సిబ్బందికి శుభవార్త..

# ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఎస్జీపీ

**అమరావతి, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 15,000కు పైగా ఉన్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 1.30 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా 2019, 2020 సంవత్సరాల్లో తొలి విడతలో నియమితులైన ఉద్యోగులకు ఈ స్కేల్ ప్రయోజనం చేకూరనుంది. 11వ వేతన సవరణ కమిషన్ చేసిన సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది. అయితే, ఇది రెగ్యులర్ పదోన్నతి కాదని, కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. ఒకే పోస్టులో ఎక్కువ కాలం పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో భాగంగానే ఈ స్పెషల్ గ్రేడ్ స్కేల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఏఏఎస్ నిబంధనల ప్రకారం, ఉద్యోగులకు 6 ఏళ్ల సర్వీసుకు స్పెషల్ గ్రేడ్, ఆ తర్వాత 12, 18, 24 ఏళ్ల సర్వీసుకు తదుపరి ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో, అర్హులైన ఉద్యోగుల సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్‌ను వెంటనే మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## టీడీపీ ఫైర్ బ్రాండ్స్ అందరూ సైలెన్స్.. ఎందుకంటారు?

అధికార తెలుగుదేశం పార్టీ అంతర్గత రాజకీయ వ్యవహారాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల కొద్ది రోజులుగా టీడీపీ నేతల వైఖరిని గమనిస్తే స్పష్టమైన మార్పు కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్స్ గా ముద్రపడిన నేతలు వివాదాలు దూరంగా ఉండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత రెండేళ్లుగా వివిధ రకాల వివాదాలతో పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిన నేతలు ఇప్పుడు అనూహ్యంగా వివాదాలకు దూరంగా ఉంటూ కేవలం తమ నియోజకవర్గాలకే పరిమితం అయిపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు ఎమ్మెల్యేల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా ఉండేదని విమర్శలు ఎదుర్కొన్నారు. ఇందులో ప్రధానంగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ రఘు రామరాజు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతోపాటు మరికొందరు పేర్లు ఎక్కువగా వార్తల్లో ఉండేవి. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి అయితే పార్టీ గెలిచిన తొలిరోజే ప్రత్యర్థుల ఇళ్లపై దూకుడు చూపించడమే కాకుండా, సొంత పార్టీ కేడర్ తోనూ గొడవలు పెట్టుకుని అధిష్టానంతో చీవాట్లు తినేవరకు వచ్చిందని అంటున్నారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పై వ్యక్తిగత ఆరోపణలు చేయడమే కాకుండా, ఇద్దరూ రోడ్డెక్కిన పరిస్థితి పార్టీకి తీవ్ర తలనొప్పులు తెచ్చిపెట్టిందని చెబుతున్నారు. దీంతో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడిపై సస్పెన్షన్ వేటు వేయాలని పార్టీ క్రమశిక్షణ సంఘం సిఫార్సు చేసేవరకు వచ్చింది. అయితే ఈ విషయంలో అధినేత చంద్రబాబు కాస్త సమయమనం పాటించడంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చినట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. సస్పెన్షన్ సిఫార్సుల తర్వాత ఎమ్మెల్యే కొలికపూడి కాస్త తగ్గినట్లు కనిపిస్తున్నారని అంటున్నారు. ఇదేసమయంలో అంతకుముందు రోజూ ఏదో ఒక వివాదంలో ఇరుకున్న పరిస్థితి మారిందని చెబుతున్నారు. అదేవిధంగా డిప్యూటీ స్పీకర్ రఘు రామరాజు కూడా కాస్త దూకుడు తగ్గించినట్లు ఉందని పరిశీలకులు చెబుతున్నారు.

ఏమైందో కానీ ఇటీవల రఘు రామరాజు వ్యవహారశైలిలో పూర్తిగా మార్పు వచ్చిందని టీడీపీ నేతల అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. తనపై కస్టోడియల్ టార్చర్ కేసులో చర్యలు లేవని ప్రభుత్వంపై చిర్రుబుర్రులాడటమే కాకుండా అనేక విషయాల్లో పార్టీ లైన్ ను అతిక్రమించి రఘు రామ మాట్లాడేవారని విమర్శలు ఎదుర్కొన్నట్లు చెబుతున్నారు. ఇక ఆకివీడు రామాలయం విషయంలో జరిగిన రచ్చ అంతా ఇంతా కాదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో రఘురామ కూడా కొన్ని రోజులుగా నోటికి పని తగ్గించడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. అదేవిధంగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా కూడా దూకుడు తగ్గించడంపై పార్టీలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కాపునేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు వెళ్లిన బొండా ఉమా అనుకోకుండా వివాదంలో చిక్కుకోగా, ఆయన తీరును ప్రశ్నించిన వారిపై ఘాటు వ్యాఖ్యలు చేసి రచ్చ రచ్చ చేశారని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకున్న తర్వాత బొండా తీరులో అనూహ్య మార్పు వచ్చిందని అంటున్నారు. రాముడు మంచి బాలుడు అన్నటైపులో అధిష్టానానికి వీరవిధేయుడిగా ప్రచారం చేసుకోవడంలో బొండా తలమునలకై పనిచేస్తుండటంపై కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వైఖరిలో కూడా కొంత మార్పు కనిపిస్తోందని అంటున్నారు. ఇంతకముందులా తన సహజసిద్ధ వైఖరికి భిన్నంగా అఖిలప్రియ దూకుడు తగ్గించడంపై కార్యకర్తల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నలుగురే కాకుండా టీడీపీలో ఎంతో మంది నేతలు వివాదాలకు దూరంగా ఉండేలా తీరు మార్చుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి టీడీపీ ఎమ్మెల్యేల్లో వచ్చిన మార్పునకు అధిష్టానం తీసుకున్న చర్యలు ఏంటి అన్నదే కార్యకర్తల్లో హాట్ టాపిక్ అవుతోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## నలుగురిని కబళించిన డ్రైవర్ నిద్రమత్తు

### కారు అదుపు తప్పి ఘోర రోడ్డు ప్రమాదం - శంషాబాద్ పాలమాకులలో దుర్ఘటన..



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వారంతా బాల్య స్నేహితులు. కలిసిమెలిసి ఉంటూ వ్యాపారం చేస్తున్నారు. సొంతూరిలో వినాయక నిమజ్జనానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. మరో పది నిమిషాల్లో గమ్యం చేరుకోవాల్సిన వారిని మృత్యువు కబళించింది. కారు డ్రైవరు నిద్ర మత్తులో నడుపుతూ వాహనం మీద నియంత్రణ కోల్పోవడంతో జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకులలోని హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ వై.సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మెట్టుగడ్డ తండా, నాగులదిన్నె తండాలకు చెందిన కెతావత్ లింబ్యానాయక్(54), కాట్రావత్ మాన్‌సింగ్(48), కేతావత్ వస్రాం(45) బాల్య స్నేహితులు. లింబ్యా, మాన్‌సింగ్ ఇద్దరూ జమున(45), మారుబాయి అనే అక్కాచెల్లెళ్లను వివాహమాడి బంధువులయ్యారు. లింబ్యా, మాన్‌సింగ్, వస్రాం 2003లో శంషాబాద్‌కు వచ్చి మధురానగర్‌లో ఉంటూ ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. సొంతూరు మెట్టుగడ్డ తండాలో శుక్రవారం నిర్వహించిన గణేశ్ నిమజ్జనానికి గ్రామస్థులు ఆహ్వానించారు. ఇటీవల కారు కొనుగోలు చేసిన లింబ్యా, భార్య జమున, బాల్య స్నేహితులతో శుక్రవారం ఉదయం వెళ్లారు. నిమజ్జనం పూర్తయ్యాక అర్ధరాత్రి శంషాబాద్‌కు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున 1.30 గంటలకు పాలమాకుల వద్దకు చేరుకోగానే డ్రైవర్ సభావత్ అశోక్ కారు నడుపుతూ నిద్రలోకి జారుకున్నాడు. వాహనం రోడ్డు మధ్యలోని క్రాస్ బ్యారియర్‌ను ఢీకొని గాల్లోకి ఎగిరింది. ఎడమవైపు దూసుకెళ్లి రోడ్డు పక్కన నిర్మాణంలో ఉన్న బాక్స్ కల్వర్టు(వరద వెళ్లడానికి నిర్మించింది) చువ్వలను ఢీకొట్టింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నా వేగం ధాటికి గాఢ నిద్రలో ఉన్న లింబ్యా, మాన్‌సింగ్, వస్రాం, జమున తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవరు అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మాదాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లింబ్యా దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు చేశారు. మాన్‌సింగ్‌కు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమార్తె పెళ్లి చేశారు. వస్రాంకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఓ కుమారుడి వివాహం జరిగింది.

## హైదరాబాద్-ఖమ్మం హైవేపై కారులో మంటలు.. వైద్యుడి సజీవదహనం

**సూర్యాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ - ఖమ్మం జాతీయ రహదారిపై సూర్యాపేట సమీపంలోని పిల్లలమర్రి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మం వైపు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన కొద్ది నిమిషాల్లోనే కారు మొత్తం మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో అందులోని వ్యక్తి సజీవ దహనమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని వైద్యుడు డా. కాసకుర్తి జగదీశ్‌గా గుర్తించారు. ఆయన ఖమ్మం మమత ఆస్పత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నారు.



### చాట్ జీపీటీతో దొరికి..

## ఐఐటీ బాంబే విద్యార్థి ఆత్మహత్య



**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐఐటీ బాంబే క్యాంపస్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సాహిల్ (22) ఆత్మహత్య తీవ్ర కలకలం రేపింది. కుల వివక్షతో కూడిన వేధింపులవల్లే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపించడంతో వివాదం మలుపు తిరిగింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రోద్బలం), ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్ట నిబంధనల కింద కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాకు చెందిన సాహిల్ రవీంద్ర వకోడే ఐఐటీ బాంబేలో 'ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' విభాగ రెండో సంవత్సర విద్యార్థి. ఇటీవల పరీక్ష హాలులోకి సెల్‌ఫోన్ తీసుకొచ్చి ప్రశ్నపత్రాన్ని చాట్ జీపీటీలో అప్‌లోడ్ చేస్తుంటే దొరికిపోయాడని అధికారులు తెలిపారు. అయినప్పటికీ క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని, డిపార్ట్‌మెంట్ హెడ్, ఇన్‌స్ట్రక్టర్... సాహిల్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు పేర్కొన్నారు. కాగా, శుక్రవారం రాత్రి హాస్టల్ గదిలో సాహిల్ ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిచ్చింది. ఈ ఏడాది క్యాంపస్‌లో చోటుచేసుకున్న మూడో బలవన్మరణం ఇది. శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగిన విద్యార్థులు..వరుస ఆత్మహత్యలపై ఐఐటీ యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా.. సాహిల్‌ను వేధింపులకు గురిచేయడం వల్లే చనిపోయాడని అతడి తల్లిదండ్రులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండు చేశారు.

## రక్షించాల్సిన చేతులు.. రాక్షసంగా మారాయి

### మహిళను కొట్టి.. జుట్టు పట్టి ఈడ్చుకెళ్లిన హోంగార్డు



**మియాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు ఓ మహిళపై దాడి చేసి, జుట్టు పట్టి ఈడ్చుకెళ్లి అమానుషంగా ప్రవర్తించాడు. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు సంబంధిత హోంగార్డును విధుల నుంచి తొలగిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మియాపూర్ సీఐ జయరాం, ఎస్సై లింగం కథనం ప్రకారం.. సంచార జీవనం సాగించే కుటుంబాలు హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తుంటాయి. శుక్రవారం రాత్రి రైల్వేస్టేషన్ సమీపంలో వీరిలోని ఓ మహిళకు.. స్థానికులకు గొడవ జరిగింది. స్టేషన్ వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఆనంద్‌కు స్థానికులు సమాచారమిచ్చారు. అతను అక్కడికి చేరుకొని ఆమెను తొలుత లాఠీతో కొట్టాడు. ఆపై జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లాడు. బాధితురాలి కుటుంబీకులు వదిలేయాలని బతిమాలుతున్నా పట్టించుకోకుండా కాఠిన్యం ప్రదర్శించాడు. ఈ ఘటన వీడియో వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మియాపూర్ పోలీసులు సుమోటోగా హోంగార్డు ఆనంద్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాధిత మహిళ వివరాలు సేకరించేందుకు వెళ్లగా ఆమె ఆచూకీ లభించలేదు.



# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




సోమవారం, 21 సెప్టెంబర్, 2026



www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


### స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు...

# అది మన వారసత్వ సంపద

**స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం - వారు నడయాడిన ప్రదేశాలను సందర్శిస్తే దేశభక్తి పెరుగుతుంది**
**త్యాగధనుల జీవితం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి**
**భారతీయం కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు**





**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన భారతీయుల వారసత్వ సంపద అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 'భారతీయం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ... "ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఇల్లు, పొలం, డబ్బు, బంగారం, ఆస్తులు సంపాదిస్తాడు. తాను వాటిని తనతో తీసుకెళ్లలేనని తెలిసినా, తన పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకుని తనకంటే గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటాడు. అదే సమయంలో, ఆ సంపద వెనుక ఉన్న తన కష్టం, శ్రమ, విలువలు పిల్లలకు తెలియాలని కూడా కోరుకుంటాడు. లేదంటే తాము సంపాదించినదంతా కోల్పోయి, పిల్లలు తిరిగి మొదటి స్థితికి చేరుకుంటారని భయపడతాడు. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించారు. ఆ సంపదను అనుభవించడం మాత్రమే కాదు... దాని విలువను తెలుసుకుని, కాపాడుకోవడం మన బాధ్యత. మన వంశం గురించి మనం తెలుసుకున్నట్లే, మన దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల గురించి కూడా తెలుసుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జీవించాలి. దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం కాదు. "నేను భారతీయుడిని" అని గర్వంగా చెప్పుకోగలిగే స్వేచ్ఛ వెనుక ఎందరో చేసిన త్యాగాలను గుర్తుంచుకోవడం అని తెలిపారు.

**స్వాతంత్ర్య సమయంలో పుట్టిన పదం భారతీయం**

"భారతీయం అనే మాట ఇప్పుడు పుట్టింది కాదు. భారతదేశం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పుట్టిన మాట భారతీయం. సైమన్ కమిషన్ వచ్చినప్పుడు "భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకోవాలి" అంటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. "సైమన్ గో బ్యాక్" అంటూ నల్లజెండాలతో ప్రజలు ఉద్యమించారు. ఎందరో జైళ్లకు వెళ్లారు. "భారతీయం లేని సైమన్ మాకు వద్దు" అని నిరసనలు తెలిపారు. అప్పుడు పుట్టిందే "భారతీయం". భారతీయం గురించి ఎప్పుడూ చర్చిస్తూ ఉండాలి. అప్పుడే పిల్లలకు స్వాతంత్ర్యం గురించి తెలుసుకొని దేశభక్తి పొంది ఉంటారు. లేదంటే దేశభక్తి, నైతిక విలువలు నశించిపోతాయి" అని అన్నారు.

**త్యాగాల స్ఫూర్తితో దేశభక్తి భావనను పెంపొందిద్దాం**

"అండమాన్‌లోని కాలాపాని జైలు గురించి చదివితే స్వాతంత్ర్య సమర యోధులు అనుభవించిన కష్టాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదులు, ఒంటరితనం, శారీరక హింస... అయినా వారి సంకల్పం మాత్రం చెదరలేదు. గాంధీజీ, నెహ్రూ, లాలా లజపతిరాయ్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి అనేకమంది మహనీయుల జీవితాలను చదివితే స్వాతంత్ర్యం ఎంతటి త్యాగాల ఫలితమో అర్థమవుతుంది. టంగుటూరి ప్రకాశం పంతులు గారు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి చూపిన ధైర్యం కారణంగానే ఆయనకు "ఆంధ్రకేసరి" అనే బిరుదు వచ్చింది. రైతులకు నీరు అందించాలనే ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిన ప్రకాశం బ్యారేజీ కూడా ఆయన పేరును గుర్తుచేస్తుంది. ఘంటసాల వెంకటేశ్వర రావు గారు కేవలం గాయకుడిగా మాత్రమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు గారి అంతిమయాత్రలో పాల్గొని దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు వెంట ఉన్నారు. కళను కూడా దేశసేవకు ఉపయోగించిన మహనీయుడు ఆయన. బంకించంద్ర ఛటర్జీ రచించిన "ఆనందమఠం" వంటి రచనలు దేశభక్తి, క్రమశిక్షణ, దేశం పట్ల బాధ్యత వంటి భావాలను ప్రజల్లో బలపరిచాయి. "వందేమాతరం" కూడా అదే భావజాలానికి ప్రతీకగా నిలిచింది. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు జీవించిన జైళ్లు, స్మారకాలు, పోరాట ప్రదేశాలు కూడా అంతే ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు. వాటిని సందర్శించినప్పుడు ఆసక్తి పెరుగుతుంది. వాటి గురించి తెలుసు కున్నప్పుడు చరిత్ర అర్థమవుతుంది. చరిత్ర అర్థమైనప్పుడు దేశభక్తి మరింత బలపడుతుంది. అందుకే పిల్లలకు పుస్తకాలు బహుమతిగా ఇవ్వండి. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివించండి. అండమాన్ వంటి చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లండి. మనకు లభించిన స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను వారికి తెలియజేయండి. ఎందుకంటే వారి త్యాగాలను తెలుసుకోవడమే మన వారసత్వాన్ని తెలుసుకోవడం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్యం మనకు సాధారణంగా రాలేదు, ఎందరో త్యాగాల ఫలితంగా వచ్చింది, ఆ త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమవుతుంది. భారతదేశం మనది. ఈ దేశాన్ని గౌరవించడం, కాపాడడం మన బాధ్యత. దేశ సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వర్తమానానికి పునాది, మన భవిష్యత్తుకు వారసత్వ సంపద" అని పేర్కొన్నారు.

**దేశభక్తి ఉన్న లోకేష్ విద్యా శాఖ మంత్రి అవ్వడం విద్యార్థుల అదృష్టం**

"పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు, చరిత్ర పట్ల గౌరవం పెంపొందించాలనే ఉద్దేశంతో "భారతీయం" కార్యక్రమం నిర్వహించాలనే ఆలోచనను మంత్రి నారా లోకేష్ గారి ఇంటికి వెళ్ళి చెప్పగానే, ఆయన వెంటనే స్పందించి కార్యక్రమానికి వస్తానని చెప్పారు. ఆయనతో మాట్లాడి తిరిగి వెళుతుంటే నా కారు వద్దకు వచ్చి పెద్దాయన జాగ్రత్త అని నా కారు డ్రైవర్‌కు చెప్పి మరీ వెళ్ళారు. కార్యక్రమం మొదలు సమయాన్ని చెప్పిన దానికంటే ముందుగానే వచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ఆయన దేశం, చరిత్ర పట్ల చూపిన ఆసక్తికి నిదర్శనం. ఇటువంటి దేశభక్తి ఉన్న లోకేష్ వంటి నాయకుడు రాష్ట్ర విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టం" అని మంత్రి లోకేష్‌ను అభినందించారు చాగంటి కోటేశ్వరరావు గారు.

### మంత్రి నారా లోకేష్‌కు

# స్వాగతం పలికిన ఎంపీ హరీష్ బాలయోగి



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారతీయం కార్యక్రమానికి హాజరవడానికి విచ్చేసిన విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ఘన స్వాగతం పలికారు.

# నిజాయితీకి చిరు సత్కారం



**అమలాపురం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన సుమారు రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలను నిజాయితీగా పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్‌ను అమలాపురం టౌన్ పోలీసులు, బాధిత మహిళ అభినందించి సత్కరించారు. అయినవిల్లి గ్రామానికి చెందిన పోలేటి సతీష్ (28), బాబురావు కుమారుడు, తన ఆటో (ఎ పి 05 టి టి ఎక్స్ 5370)లో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో అమలాపురం ఏరియా ఆసుపత్రి నుంచి ప్రయాణికురాలిని తీసుకెళ్లాడు. ఈ క్రమంలో గొంది గ్రామానికి చెందిన నల్లి వనిత, సఖినేటిపల్లి, అమలాపురం ఏరియా ఆసుపత్రిలో టీబీ జిల్లా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆమె తన సుమారు రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఆటోలోనే మర్చిపోయి దిగిపోయారు. ఆభరణాలు ఆటోలో ఉన్నట్లు గుర్తించిన సతీష్ వాటిని భద్రంగా తీసుకుని అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసుల సమక్షంలో బాధిత మహిళకు అందజేశాడు. సతీష్ నిజాయితీని అభినందించిన పోలీసులు, బాధిత మహిళ ఆయనను శాలువాతో సత్కరించారు.

### రామచంద్రపురం పట్టణంలో

# నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

**రామచంద్రపురం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని వెల్ల హెడ్ వాటర్ వర్క్స్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అత్యవసర మరమ్మతు పనులు జరుగుతుండటంతో, సోమవారం (సెప్టెంబర్ 21, 2026) పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గుర్తించి, సరిపడా నీటిని ముందస్తుగా నిల్వ చేసుకోవాలని పురపాలక సంఘం అధికారులు విజ్ఞప్తి చేశారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే తాగునీటి సరఫరాను తిరిగి యథావిధిగా పునరుద్ధరిస్తామని, ప్రజలు ఈ విషయంలో మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.












### ద్రాక్షారామం అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు

# అండగా నిలిచిన మంత్రి సుభాష్

**41 మంది వ్యాపారులకు రూ.21.50 లక్షల పరిహారం అందజేత - కాలిపోయిన షాపుల స్థానంలో కొత్త షాపులు.. మౌలిక సదుపాయాలు**
**మరణించిన వ్యాపారి కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం**



**ద్రాక్షారామం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం కూరగాయల మార్కెట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో షాపులు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడిన వ్యాపార కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచారు. ప్రమాదం జరిగిన వెంటనే అర్ధరాత్రి మార్కెట్‌కు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్న మంత్రి, బాధిత వ్యాపారులను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున రూ.20 లక్షల సహాయాన్ని ప్రకటించారు. ప్రమాదంతో ఉపాధి కోల్పోయిన వ్యాపారులు తిరిగి తమ వ్యాపారాలను ప్రారంభించుకునేలా కాలిపోయిన షాపుల స్థానంలో నూతన షాపుల నిర్మాణం చేపట్టి ఇటీవల ప్రారంభించారు. అంతటితో ఆగకుండా విద్యుత్ సౌకర్యం, షెడ్లు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను కూడా సమకూర్చారు. బాధిత వ్యాపారుల పునరావాసానికి పలువురు దాతలు, మార్కెట్ కమిటీ కూడా సహకరించారు.

**41 మంది వ్యాపారులకు రూ.21.50 లక్షల పరిహారం**

ఆదివారం ద్రాక్షారామం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రామచంద్రపురం డీఎస్పీ ఎం. శేషు చేతుల మీదుగా 41 మంది వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.21.50 లక్షల నగదు పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న వారి పట్ల బాధ్యతలు వ్యవహరించడం తన కర్తవ్యం అన్నారు. మన రామచంద్రపురం.. మన ద్రాక్షారామం నినాదంతో ఈ కార్యక్రమం దాతల సహకారంతో విజయవంతం చేసామన్నారు. మార్కెట్లో ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు తిరిగేలా రోడ్లు నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ 80 లక్షల రూపాయలు గ్రాంట్ మంజూరు చేయడం, పోలీసు అధికారులు సైతం తమ వంతు సాయం అందించడం అభినందనీయమన్నారు. వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మంత్రి సుభాష్, దాతల సహకారంతో బాధితుల పక్షాన నిలబడి సహకరించడం ఆనందంగా ఉందన్నారు. సేవ చేయడంలో పోటీ పడాలి కానీ. చెడగొట్టడంలో కాదని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ..అగ్నిప్రమాదం కారణంగా తీవ్రంగా నష్టపోయిన సమయంలో తమకు అండగా నిలిచి, షాపుల పునర్నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకరించిన మంత్రి సుభాష్‌కు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. సహాయం అందించిన దాతలకు కూడా వారు ధన్యవాదాలు తెలియజేశారు.

**మరణించిన వ్యాపారి కుటుంబానికి రూ.1.50 లక్షల సాయం**

ద్రాక్షారామం మార్కెట్‌లో షాపు నిర్వహిస్తున్న వెలం పాలెంకు చెందిన సిరిగినీడి శ్రీనివాస్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో మంత్రి సుభాష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి మార్కెట్‌కు సమకూరిన నిధుల నుంచి రూ.1 లక్ష, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున రూ.50 వేలు, మొత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని మంత్రి చేతుల మీదుగా అందజేశారు. మంత్రి వెంట టేకుమూడి సత్యనారాయణ, కూటమి నాయకులున్నారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచిన మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యశ్రీ కు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంకం సుబ్బారావు, మాగాపు అమ్మిరాజు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టిడిపి రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, డాక్టర్ రాంబాబు, సలాది శ్రీనివాసు, ఆళ్ల బుజ్జి, పెంకే సాంబశివరావు, రామకృష్ణ, కూటమి పార్టీల నాయకులు, మార్కెట్ వ్యాపారులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం, అభివృద్ధిపై చంద్రబాబుది దూరదృష్టి

**వైసీపీ నేతలది వక్రబుద్ధి : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**రావులపాలెం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** పాలనలో చంద్రబాబు దూరదృష్టితో ఆలోచిస్తారని, జగన్ మోహన్ రెడ్డి వక్రబుద్ధితో ప్రతిదీ రాజకీయం చేస్తారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విమర్శించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాలెంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొత్తపేట శాసనసభ్యులు బండారి సత్యానందరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో వైసీపీ నాయకులు ప్రతి సమస్యను చంద్రబాబు నాయుడుకు ఆపాదించడం సరికాదని టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. చంద్రబాబు ముందుచూపుతో చేపట్టిన పట్టిసీమ, పురుషోత్తపట్నం, వెలిగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు నేడు రైతులకు, ప్రజలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.



**రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**

కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బండారు తెలిపారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. రాష్ట్రంలో కరువు ప్రభావిత మండలాల గుర్తింపు, రైతులకు భరోసా కల్పించడం, సాగు-తాగునీటి సమస్యలను ఎదుర్కొనేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

**యూరియా కొరతపై స్పష్టత ఇవ్వాలి**

రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే బండారు స్పందిస్తూ.. రైతులు అవసరానికి అనుగుణంగా ఎరువులు వినియోగించేలా ప్రభుత్వం సూచనలు చేస్తోందని తెలిపారు. ఎక్కడైనా సరఫరా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

గతంలో కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించిన ఎమ్మెల్యే బండారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కాలువల పరిస్థితిపై పరిశీలనలు నిర్వహించి, అవసరమైన చోట మరమ్మతులు చేపడుతోందన్నారు. అమలాపురం పరిధిలో కాలువల సమస్యలపై అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు.

**పట్టాదారు పాస్‌బుక్స్, భూ రికార్డుల సవరణ**

భూ రికార్డుల్లో గతంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే, రెవెన్యూ రికార్డుల సవరణపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే బండారు అన్నారు. క్యూఆర్ కోడ్, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్స్‌ను అందించడం జరుగుతోందని తెలిపారు. భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో వేగం**

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం త్వరితగతిన చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో రైతులు చెల్లింపుల కోసం ఎదురుచూసిన పరిస్థితులు ఉండేవని ఆరోపించిన ఆయన.. ప్రస్తుతం రైతులకు సమయానుకూలంగా చెల్లింపులు అందేలా వ్యవస్థను బలోపేతం చేశామని పేర్కొన్నారు.

**నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు**

ఎల్‌నినో ప్రభావం, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా కొన్ని నిత్యావసర వస్తువుల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఎమ్మెల్యే బండారు అన్నారు. బియ్యం, ఉల్లిపాయలు తదితర వస్తువులను అందుబాటు ధరల్లో ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

**ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

ఎంఆర్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే బండారు తెలిపారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడి, ఎక్కడైనా ఎంఆర్పీకి మించి విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.

**ఇసుక విషయంలో పారదర్శక విధానం**

ఇసుక సరఫరాలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే విధానాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే బండారు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుకకు అధిక ధరలు చెల్లించాల్సిన పరిస్థితులు ఉండేవని ఆరోపించిన ఆయన.. ప్రస్తుతం రవాణా, జీఎస్టీ తదితర చట్టబద్ధమైన ఖర్చులు మినహా ప్రజలకు అందుబాటులో ఇసుక లభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

**వాడపల్లి దేవస్థానం అభివృద్ధిపై దృష్టి**

వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బండారు చెప్పారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విషయంలో మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

**నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం**

కోటపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రోడ్లు, సాగునీరు, రవాణా, దేవస్థానాలు తదితర రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే బండారు పేర్కొన్నారు. బొద్దం లిఫ్ట్ ఇరిగేషన్, రావులపాలెం--వాడపల్లి రహదారి, సర్వీస్ రోడ్లు వంటి పలు అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

**రాజకీయ విమర్శలకంటే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి**

ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే సూచనలు, సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు వైసీపీ నాయకులకు సూచించారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

**గత పాలనపై ప్రజలకు అవగాహన ఉంది**

గత ఐదేళ్ల పాలనలో జరిగిన పరిణామాలను ప్రజలు గమనించారని ఎమ్మెల్యే బండారు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను గత పాలనతో ప్రజలు పోల్చి చూస్తున్నారని పేర్కొన్నారు.

**శాంతిభద్రతల విషయంలో పోలీసుల చర్యలు**

గంజాయి, అక్రమ కార్యకలాపాలు, చట్టవిరుద్ధ చర్యలను అరికట్టేందుకు పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బండారు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**అభివృద్ధిపై ముందుకు వెళ్తా**

రాజకీయలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధిపై పనిచేస్తానని.ప్రజలకు ఉపయోగపడే సూచనలు, సలహాలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే బండారు పిలుపునిచ్చారు.

### పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు

# స్కాలర్ షిప్‌లు అందజేసిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపాలెం హైస్కూల్‌లో విద్యనభ్యసించి 2026 పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పదిమంది విద్యార్థులకు వాడపాలెం బండారు పేరమ్మ గారి స్వామి గారి అన్నదాన సత్రంవారు సమకూర్చిన రూ.1లక్ష స్కాలర్షిప్ ను కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానంద రావు ఆదివారం అందచేశారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున చెక్కులను మొత్తం పదిమందికి కలిపి రూ.1 లక్ష విలువచేసే చెక్కులను అందచేశారు. విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆశీర్వదించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమం చేపట్టిన సత్రం చైర్మన్ బండారు పెద వెర్రియ్య, సత్రం కమిటీ వారికి అభినందనలు తెలియచేసారు. కార్యక్రమం లో గ్రామ మాజీ సర్పంచ్ బండారు బులితాత,చీకట్ల రామారావు,పప్పుల బుజ్జి, బండారు వీరబాబు, సింగిరెడ్డి గోవింద స్వామి,బడుగు సాధుబాబు,పప్పుల రాంబాబు, ప్రధానోపాధ్యాయులు బండారు నారాయణ, పల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**అమలాపురం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం (సెప్టెంబరు 21) యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి తెలిపారు. జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాలు, అన్ని మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు అన్ని కేంద్రాల్లో పీజీఆర్ఎస్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. అర్జీ పరిష్కారమైన అనంతరం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలోని లోపాలను గుర్తించి, వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**1100కు ఫిర్యాదు చేయొచ్చు**

పీజీఆర్ఎస్ కేంద్రాలకు రావడంతో పాటు ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. అలాగే 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రజలు అందుబాటులో ఉన్న ఈ సేవలను వినియోగించుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు.

### ధాన్యం సేకరణలో

# వాహన యజమానులు సహకరించాలి

**డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు**



**అమలాపురం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు వాహన యజమానులు సహకరించాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ధాన్యం సేకరణకు సరిపడా వాహనాలను సమకూర్చడం కీలకమని తెలిపారు. ట్రాక్టర్ ట్రైలర్లు, లారీల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రైతు సేవా కేంద్రాల్లో తమ వాహనాల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుకోవాలని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు లారీ యజమానుల సంఘం సహకరించాలని డీటీఓ కోరారు.

# అమలాపురంలో ప్రమాదం..

**బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది**
**- శబ్ద దాటికి ఎగిరిపడ్డ యువకులు.. ఒకరికి గాయాలు**
**గ్యాస్ సిలిండర్ పేలుడా? పిడుగుపాటా? - విస్ఫోటనంపై దర్యాప్తు ముమ్మరం**
**- రాజమండ్రి నుంచి ఫొరెన్సిక్ నిపుణులు**



**అమలాపురం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని మహిపాల వీధిలో ఎం.ఎస్.ఎన్. మూర్తి (మలిశెట్టి మూర్తి మాస్టర్) నివాసంలో ఆదివారం ప్రమాదం సంభవించింది. విషయం తెలిసిన వెంటనే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రతను, ధ్వంసమైన ఇంటిని పరిశీలించారు. ప్రమాదం ధాటికి ఇంటి కిటికీలు ఊడిపోయి దూరంగా పడిపోయాయి. పై అంతస్తులోని బెడ్‌రూమ్‌లో ఉన్న మూర్తి మాస్టర్ ఇద్దరు కుమారులు భారీ శబ్దానికి బయటకు ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో ఒక యువకుడికి గాయాలు కాగా, వెంటనే ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో నష్టం అంచనా వేయడం కష్టంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు బాధితులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, తక్షణ సహాయక చర్యలతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడు కారణమా? లేక పిడుగుపాటు వల్ల విస్ఫోటనం జరిగిందా? అనే అంశంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అసలు కారణాలను నిగ్గు తేల్చేందుకు రాజమండ్రి నుంచి ఫొరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి రానున్నారు. అమలాపురం పట్టణ సీఐ ఆధ్వర్యంలోని పోలీసు బృందం ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తును వేగవంతం చేసింది. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన భారతీయం

**108 మంత్రాలతో భారతమాతకు పుష్పాంజలి, హారతులు - భారతీయ సంస్కృతి, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా కొనసాగిన భారతీయం కార్యక్రమం**



**కాకినాడ, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. సత్సంగంలో మంత్రి నారా లోకేష్‌కు చాగంటి కోటేశ్వరరావు వేద ఆశీర్వచనం అందించారు. కంచి కామకోటి పీఠం 68వ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి (కంచి పరమాచార్య) రచించిన 'దేవుని స్వరం' పుస్తకాలను ఈ సందర్భంగా లోకేష్ కు బహుకరించారు. అనంతరం సత్సంగం సభ్యులతో మంత్రి ముచ్చటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

**వినూత్నంగా భారతమాతకు హారతులు**

కార్యక్రమంలో భారతమాతకు 108 మంత్రాలతో పుష్పాంజలి సమర్పించారు. భారతీయతను ప్రతిబింబించే శబ్దాలను, స్వరాలను మేళవించి వందేమాతరం గీతాలాపనతో వినూత్నంగా భారతమాతకు హారతులు ఇచ్చారు.

**సైనిక సేవలను విద్యార్థులతో పంచుకున్న మాజీ సైనికుడు**

కార్యక్రమంలో మాజీ సైనికుడు డా. కిరణ్ కుమార్ భారత సైన్యంలో తాను అందించిన సేవలు, తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశ రక్షణ కోసం ఆయన అందించిన సేవలను అభినందిస్తూ మంత్రి డా. కిరణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ మెమెంటోలు అందజేసి సత్కరించారు. భారతీయ సంస్కృతి, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా భారతీయం కార్యక్రమం కొనసాగింది

నేటి నుంచి పిఠాపురంలో

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, సెప్టెంబరు 20, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నేడు, రేపు కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం పర్యటనను పురస్కరించుకుని నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో పర్యటన సాగే ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే వేదిక, బ్యారికేడింగ్ వ్యవస్థ, ప్రభుత్వ శాఖల స్టాళ్ల ఏర్పాటుపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేసి, పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఎఫ్.కె. పాలెం, నాగులపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను కూడా ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. తాగునీటి ప్రాజెక్టుల వద్ద శిలాఫలకాల ఏర్పాటు, సభా ప్రాంగణాల పనులను కలెక్టర్ వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మల్లిబాబు, పాడా పీడీ శివరామప్రసాద్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు

# సాదర వీడ్కోలు పలికిన నాయకులు



**కాకినాడ, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే ఉద్దేశంతో ఆదివారం కాకినాడ రూరల్ తిమ్మాపురం లోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో భారతీయం పేరిట పాఠశాల విద్యాశాఖ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర విద్య, మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. కాకినాడ జిల్లా ఒకరోజు పర్యటన ముగించుకొని మ. 2.45 గం.లకు మంత్రి నారా లోకేష్ రోడ్డు మార్గాన రాజమండ్రి విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం, కాకినాడ పట్టణం, కాకినాడ రూరల్ శాసన సభ్యులు నిమ్మకాయల చిన్నరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ శాసనసభ్యుడు ఎస్వీఎస్ఎన్. వర్మ ఇతర ప్రజా ప్రతినిధులు మంత్రి కి సాదర వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి. నాగమణి, కాకినాడ జిల్లా విద్యాధికారి పి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తలుపులమ్మ లోవ దేవస్థానంలో

# ఒక్కరోజు ఆదాయము రూ. 3 లక్షలు





**కోటనందూరు, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం లోవ దేవస్థానంలో ఈ రోజు ది.20.09.2026 ఆదివారం ఆలయ తెరుచు సమయములో ఉదయం గం.5.00ల నుండి సాయంత్రం గం.6.00 ల వరకు మాత్రమే సుమారు 5,000 వేల మంది శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాదముల విక్రయం ద్వారా 85,150/- పూజా టిక్కెట్లు ద్వారా 1,33,120/- కేశ ఖండన టిక్కెట్లు ద్వారా 7,280/-లు వాహనపూజలు, మరియు ఇతర సేవ టిక్కెట్లు ద్వారా 13,908/- కాటేజీలు ద్వారా 50,885/- ఇతర మిసిలేనియస్ డొనేషన్లు ద్వారా రూ. 23,898/- లు వేద ఆశీర్వచనం ద్వారా రూ. 8,928/-లు వెరసి మొత్తం రు. 3,23,169/- లు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి విశ్వనాధ రాజు మీడియాకు తెలియజేసారు. భక్తులకు కావలసిన అన్ని సదుపాయములను కార్యనిర్వహణాధికారి విశ్వనాధ రాజు మరియు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ పెంటకోట భాస్కర సత్యనారాయణ పర్యవేక్షించారు.

# గోదావరి పైప్ లైన్ లీకు నీట మునిగిన పంట పొలాలు

**యర్రవరం సమీప పంట పొలాల్లో గోదావరి పైప్ లైన్ వాల్ లీక్**



**కాకినాడ, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, యర్రవరం వద్ద గోదావరి పైప్ లైన్ లీకు వల్ల పంట పొలాలు పొలాలు. నీట మునిగాయి. ఏలేరు జలాశయం నుండి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే వైఆర్సి కాలువలో గోదావరి పైప్లైన్ ద్వారాగా రాజమండ్రి నుండి ఏలేశ్వరంలో కలిసే పైప్ లైన్ వాల్ రిపేర్ కారణంగా భారీగా నీరు లీక్ అవడంతో రైతులు సాగు చేసుకునే పంట పొలాలు పూర్తిగా నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు నీరు అందడం మంచిదే కానీ అధికంగా ఈ పైపుల ద్వారా నీరు లీకవ్వడం వల్ల తమ దొండ, అరటి, వరి, పొలాలు ముంపుకు గురై పూర్తిగా నాశనం అవుతున్నాయని ఆవేదన చెందారు.దీని ద్వారా నీరు తిరుమాలి వద్ద రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు ఈ పైప్ లైన్ సంబంధిత అధికారులకు తెలిపిన కనీస చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఇరిగేషన్ సంబంధిత అధికారులు తక్షణమే నివారణ పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా పలువురు రైతులు కోరారు.

లడ్డూ వ్యవహారంపై

# కూటమి నేతలు సమాధానం చెప్పాలి

- స్థానిక ఎన్నికల్లో అన్ని సెగ్మెంట్లలో వైసీపీ విజయానికి కృషి చేయాలి..
- ఉత్తరాంధ్రకు ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు తరలించే విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంది
- మాజీ మంత్రి జిల్లా వైకాపా అధ్యక్షుడు దాడి








**కోటనందూరు, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి లో జరిగిన వెన్నుపోటు పాలనపై పోరు వైఎస్ఆర్సిపి మండల విస్తృత సమావేశం లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలకు పార్టీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని సెగ్మెంట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని రాజా సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారంపై గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేసిన కూటమి నాయకులు తాజా పరిణామాలపై సమాధానం చెప్పాలని దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు, విశాఖ ప్రాంతానికి గోదావరి జలాలను తరలించే విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని దాడిశెట్టి రాజా విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు మధ్య వ్యత్యాసం ఉందని ఆయన ఆరోపించారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం..**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతకాయల చినబాబు, లగుడు శ్రీనివాస్, బొంగు ఉమారావు, గొర్లి రామచంద్రరావు, లాలం బాబ్జి, వేముల రాజబాబు, కొరుప్రోలు కృష్ణ, లంక ప్రసాద్, వెలగా వెంకటకృష్ణాజి, నల్లమిల్లి గోవిందు, కాపారపు రత్నకుమారి, సుర్ల రాజు, తోలెం విజయరాజు, ముక్కుడుపల్లి బాబురావు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో పోస్టులు పెంచాలి

**మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం సమర్పించిన నిరుద్యోగులు**



**కాకినాడ, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పోలీస్ రిక్రూట్‌మెంట్ లో ఎస్సై, కానిస్టేబుళ్ల పోస్టుల సంఖ్యను మరింత పెంచాలని కోరుతూ పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏళ్ల తరబడి పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న తమకు మరిన్ని అవకాశాలు కల్పించాలని వారు మంత్రిని కోరారు. యువగళం పాదయాత్ర లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఉంటుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇందులో భాగంగానే పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను ప్రకటించామని చెప్పారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి, వారికి బంగారు భవిష్యత్ అందించడమే తమ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వరుసగా భర్తీ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగాల పోస్టుల సంఖ్య పెంచాలన్న అభ్యర్థుల విజ్ఞప్తిని కూడా పరిగణనలోకి తీసుకుని చర్చిస్తామని నారా లోకేష్ వారికి భరోసా ఇచ్చారు.ప్రతి ఏడాది క్రమ పద్ధతిలో పోస్టుల భర్తీ ఉంటుందని తెలిపారు. ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.



రాజమహేంద్రవరం విమానాశ్రయంలో

# ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం



**కోరుకొండ, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ కు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో పలువురు ఎన్డీఏ నాయకులు అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కాకినాడలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న "భారతీయం" కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకున్నారు. లోకేష్ కు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, కాకినాడ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి



హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మహాసేన రాజేష్, రెడ్డి సుబ్రమణ్యం, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో తొలిసారిగా క్యాన్సర్ రోగులకు జన్యు పరీక్షలు

**గుంటూరు జిజిహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక ప్రయోగశాల - రోగులకు ఉచితంగా అధునాతన పరీక్షలు**
**రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్లకు జన్యు మార్పుల గుర్తింపు - 22న ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్ యాదవ్**
**భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి కేంద్రం ఏర్పాటుపై ప్రతిపాదన**
**సీఎం చంద్రబాబు నేతృత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులని మంత్రి వెల్లడి**

**అమరావతి, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా క్యాన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. గుంటూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.2.5 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక జన్యు పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్ రోగుల నుంచి సేకరించిన నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించి కణాల్లోని జన్యు మార్పులను గుర్తిస్తారు. వాటి ఆధారంగా రోగికి ఏ చికిత్స అవసరమో వైద్యులు నిర్ణయించేందుకు వీలవుతుంది. రోగ నిర్ధారణ నుంచి చికిత్స, తదుపరి పర్యవేక్షణ వరకు ఈ విధానాన్ని ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆస్ట్రాజెనెకా సంస్థ, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థల భాగస్వామ్యంతో చేపడుతున్నారు. గుంటూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను ఈ నెల 22న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం సూక్ష్మస్థాయి జన్యు మార్పు (ఎఫ్‌అశీఅం) పరీక్షల కోసం కొందరు రోగుల నమూనాలను బెంగళూరు, ముంబయి వంటి నగరాలకు పంపించాల్సి వస్తోందని, ఈ ఇబ్బందిని తొలగించి రాష్ట్రంలోనే అధునాతన పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలన్నదే లక్ష్యమని మంత్రి తెలిపారు. జన్యు పరీక్షలను రోగులకు ఉచితంగా అందించనున్నామని, బయట ప్రైవేటు కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, పూర్తి స్థాయి పరీక్షలకు రూ.75 వేల వరకు ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయని, తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ




చంద్రబాబు నాయకత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు.

**రెండేళ్లలో 2 వేల నమూనాల పరీక్ష**

గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థ సాంకేతిక సహకారంతో అభివృద్ధి చేయనుంది. రెండేళ్లలో సుమారు 2 వేల నమూనాలను పరీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్ట్రాజెనెకా సంస్థ 1,000 మంది రొమ్ము క్యాన్సర్, 1,000 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు నిర్వహించే జన్యు పరీక్షల ఖర్చును భరిస్తుంది.

**క్యాన్సర్ కణాల్లో జన్యు మార్పుల గుర్తింపు.. మందుల సిద్ధం**

రొమ్ము క్యాన్సర్ లో బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2, ఇతర, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో ఈజీఎఫ్‌ఆర్, కేఆర్ఏఎస్, ఎన్ఆర్ఏఎస్, బీఆర్ఏఎఫ్, ఇతర మార్పులను పరిశీలిస్తారు. జన్యు పరీక్షల్లో బయటపడిన మార్పులను బట్టి ప్రత్యేక మందులను సిద్ధం చేస్తారు.

**అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి కేంద్రం**

గుంటూరులోని ప్రయోగాత్మక ప్రయోగశాల తర్వాత అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి జన్యు పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనిఅ ప్రతిపాదించారు. అధిక సంఖ్యలో పరీక్షలు నిర్వహించేలా దీనిని రాష్ట్రస్థాయి కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్ర జన్యు సమాచార వ్యవస్థతోనూ అనుసంధానిస్తారు. కృత్రిమ మేధస్సు ఉపయోగించి జన్యు సమాచారం, కృత్రిమ మేధస్సు, ఆధునిక వైద్య పరిశోధనలను అనుసంధానించడం దీర్ఘకాలిక లక్ష్యం. సేకరించే సమాచారాన్ని భవిష్యత్తులో వ్యక్తికి అనుగుణమైన చికిత్సలు, వైద్య పరిశోధనలు, ఆధునిక ఔషధ పరిశోధనలకు ఉపయోగించనున్నారు.

**14 రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తించే దిశగా**

భవిష్యత్తులో రక్తంలో కనిపించే కొన్ని మార్పులను గుర్తించడం ద్వారా 14 రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తించే పరీక్షను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనిని పెద్ద సంఖ్యలో ప్రజలకు పరీక్షలు నిర్వహించే స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉంది. రాష్ట్రస్థాయిలో జన్యు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన కూడా ఉంది. ఆరోగ్యవంతుల జన్యు సమాచారంతో పాటు అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి సమాచారాన్ని సేకరించి భద్రపరుస్తారు. భవిష్యత్తులో వ్యాధులపై పరిశోధనలు, కొత్త పరీక్షలు, మెరుగైన చికిత్స విధానాల రూపకల్పనకు దీనిని ఉపయోగిస్తారు.

**60000 వరకు ఛాతీ ఎక్స్‌రేలు**

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే విధానాన్ని ప్రాజెక్టులో భాగంగా బలోపేతం చేయనున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు రొమ్ము పరీక్షా పరికరాలను, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఛాతీ ఎక్స్‌రేలను ఉపయోగిస్తారు. ఊపిరితిత్తుల చిత్రాల్లో అనుమానిత మార్పులను కృత్రిమ మేధస్సుతో గుర్తిస్తారు. రెండేళ్లలో 60 వేల వరకు ఛాతీ ఎక్స్‌రేలను ఈ విధానంలో పరిశీలించేలా ప్రణాళిక ఉంది. వైద్య విద్య సంచాలకులు ఏ. విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న జన్యు పరీక్షల ప్రయోగశాల ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగమని తెలిపారు. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహిస్తామని, క్యాన్సర్ కణాల్లోని జన్యు మార్పులను గుర్తించడం ద్వారా వైద్యులు తగిన చికిత్సను నిర్ణయించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

900 మందికి పైగా విద్యార్థులతో

# ఘనంగా ఇంటర్‌స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్

**విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం..**
**విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణకు కరాటే దోహదం**
**కరాటే చీఫ్ కోచ్ పదాల అంజి**



**అమలాపురం, సెప్టెంబర్ 20, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థులలో సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించవచ్చని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంలో కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అమలాపురంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పవర్ కిక్ షోటోకాన్ కరాటే దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ ఇంటర్‌స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2026 ఘనంగా జరిగింది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి 900 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరై తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. వివిధ వయసు, కేటగిరీలకు అనుగుణంగా నిర్వహించిన కరాటే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కఠినమైన పోటీ వాతావరణంలో తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ప్రతిభను చాటుకున్నారు. కరాటేలోని వివిధ అంశాల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ, పట్టుదల, ఏకాగ్రత ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. కరాటే సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్న వయసు నుంచే క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వాన్ని ఆరోగ్యకరమైన రీతిలో ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మార్షల్ ఆర్ట్స్ వంటి విభాగాల్లోనూ తమ ప్రతిభను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థులకు తమ ప్రతిభను రాష్ట్రస్థాయిలో ప్రదర్శించేందుకు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు.

**విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. మహేంద్ర, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్. మనవిహార్ హాజరయ్యారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని, విద్యార్థిని అభినందించారు. కరాటేలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు**

చీఫ్ ఆర్గనైజర్ పదాల అంజి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిక్కం సురేష్ ఆధ్వర్యంలో పోటీలు విజయవంతంగా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. ఒకే వేదికపై 900 మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించడం ఈ ఛాంపియన్‌షిప్‌కు లభించిన విశేష స్పందనకు నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు. పోటీలను విజయవంతం చేయడంలో సహకరించిన కరాటే మాస్టర్లు, కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారికి సరైన వేదిక కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి పోటీలను భవిష్యత్తులోనూ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో

# రథం లాగిన బాలకృష్ణ అర్ధాంగి వసుంధర

**తిరుమల బ్రహ్మోత్సవాల్లో వైభవంగా స్వర్ణరథోత్సవం**



**తిరుమల, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** కలియుగ వైకుంఠం తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం ఉదయం స్వర్ణరథోత్సవం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు సర్వాలంకార భూషితులై స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. బంగారు వర్ణంతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణలతో తిరుమాడ వీధులు మార్మోగాయి. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. ఈ స్వర్ణరథోత్సవంలో ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె స్వయంగా రథం తాడును పట్టుకుని లాగి స్వామివారిపై తనకున్న భక్తిని చాటుకున్నారు. ఈ వేడుకలో టీటీడీ బోర్డు సభ్యురాలు, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా పాల్గొన్నారు. వసుంధర రథాన్ని లాగుతున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.

పండుగ రద్దీకి రైల్వే ఏర్పాట్లు..

# ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు



**అమరావతి, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి - శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి - శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం - చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి. వీటితో పాటు చర్లపల్లి - నాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# ధర్మవరంలో వినాయక లడ్డూ వేలంపాట

**రూ.1.45 లక్షలకు ప్రసాదాన్ని దక్కించుకున్న ముస్లిం దంపతులు**



**ధర్మవరం, సెప్టెంబర్ 20 విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఒక అరుదైన సంఘటన చోటుచేసుకుంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో చాందిని, మస్తాన్ వలి అనే ముస్లిం దంపతులు రూ.1,45,000 చెల్లించి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంటోంది. పట్టణంలోని పార్థసారథి నగర్, సిరికల్చర్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం ఉత్సవ కమిటీ లడ్డూ వేలంపాట నిర్వహించింది. ఈ వేలంలో పలువురు పోటీ పడగా, చివరికి చాందిని, మస్తాన్ వలి దంపతులు అత్యధిక ధరకు లడ్డూను గెలుచుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో లడ్డూ వేలం వేయడం ఒక సంప్రదాయంగా వస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని బాలాపూర్ లడ్డూ వేలం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.



## యాక్షన్ సీన్స్‌తో దుమ్మురేపిన రష్మిక మందన్న..

# మెంటలెక్కిస్తున్న మైసా టీజర్




ప్రస్తుతం వరుస హిట్లతో ఫుల్ జోష్ మీదుంది హీరోయిన్ రష్మిక మందన్నా. అలాగే అటు అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్లలో ఒకరిగా మారింది. తెలుగు, హిందీ భాషలలో అనేక చిత్రాల్లో నటిస్తుంది. రష్మిక మందన్న నటిస్తున్న మైసా సినిమా నుంచి తాజాగా టీజర్ విడుదలైంది. నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. కమర్షియల్ చిత్రాలతో పాటు విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనలోని నటనను మరో కోణంలో ఆవిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. దాదాపు షూటింగ్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. మైసాలో రష్మిక ఇంతకుముందెన్నడూ కనిపించని రీతిలో సరికొత్త అవతారంలో దర్శనమిచ్చారు. గిరిజన గోండు మహిళ పాత్రలో ఆమె పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునేలా కనిపించారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, యాక్షన్ సన్నివేశాల్లోనూ తనదైన శైలిలో మెప్పించనున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. తన తండ్రి కోసం, తన వాళ్ల కోసం పోరాడే మహిళగా రష్మిక పాత్రను తీర్చిదిద్దినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. కష్టకాలంలో తన ప్రజల కోసం ఆమె చేసే పోరాటమే కథలో కీలకాంశంగా ఉండబోతున్నట్లు కనిపిస్తోంది. టీజర్ ఆద్యంతం యాక్షన్ సన్నివేశాలతో నిండిపోయింది. అడవులు, గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగే కథకు తగ్గట్టుగా విజువల్స్‌ను తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటోంది. రష్మిక పాత్రలోని మాస్ షేడ్స్, యాక్షన్ సీన్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇక టీజర్‌లో జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాక్షన్ సన్నివేశాలకు తగ్గట్టుగా ఆయన అందించిన మ్యూజిక్ టీజర్‌కు మరింత ఇంపాక్ట్ తీసుకొచ్చింది. సినిమాటోగ్రఫీ, విజువల్స్ కూడా కథకు తగ్గట్టుగా కనిపిస్తున్నాయి. కొత్త తరహా యాక్షన్ థ్రిల్లర్‌గా 'మైసా' విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న 'మైసా'లో రష్మిక పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రష్మిక కెరీర్‌లో మరో డిఫరెంట్ మూవీగా 'మైసా' నిలుస్తుందా? గిరిజన మహిళగా ఆమె పాత్ర ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో తెలియాలంటే నవంబర్ 27 వరకు వేచి చూడాల్సిందే.

# తెలుగులోనే ఇలాంటి క్యారెక్టర్ చాలా కొత్త..

### బిగినింగ్ నుంచే ఒక మ్యాడ్‌నెస్ ఉంటుంది: నాని



న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. ది ప్యారడైజ్' ప్రేక్షకుల అంచనాలని అందుకుంటుంది. మాస్, యాక్షన్ థియేటర్ అదిరిపోయేలా ఉంటుందని, జడల్ లాంటి క్యారెక్టర్ ఇప్పటివరకూ తెలుగు సినిమాలో రాలేదు.నా కెరీర్ లోనే ఎక్కువ హార్డ్ వర్క్ చేసిన సినిమా ప్యారడైజ్ అని నాని అన్నారు. న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా న్యాచురల్ స్టార్ నాని విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నా కెరీర్ స్టార్ట్ అయిందే సెప్టెంబర్ లో. 'అష్టా చమ్మా' సెప్టెంబర్‌లోనే రిలీజ్ అయింది. 'భలే భలే మగాడివోయ్' కూడా సెప్టెంబర్‌లోనే వచ్చింది. ఇప్పుడు ఆ హిట్ సెంటిమెంట్ 'ప్యారడైజ్'కి వర్క్ అవుట్ అవుతుందని నమ్ముతున్నాను. జడల్ క్యారెక్టర్ గురించి మాట్లాడుతూ.. కథలో నుంచి వచ్చిన లుక్ అది. నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలు అన్నీ బాగా రిలేటబుల్‌గా, తెలిసిన ఒక పర్సన్ లాంటి ఫీలింగ్ వచ్చే రోల్స్. ఇందులో క్యారెక్టర్ మాత్రం జనరల్ సొసైటీలో పెరిగిన వ్యక్తి కాదు. అది ఏంటి అనేది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థం అవుతుంది. ఆ క్యారెక్టర్‌కి బిగినింగ్ నుంచే ఒక మ్యాడ్‌నెస్ ఉంటుంది. ఆ క్యారెక్టర్‌ని ఆడియన్స్ ఒక షాక్ వాల్యూతో చూస్తారు. నిజానికి తెలుగులోనే ఇలాంటి క్యారెక్టర్ చాలా కొత్త. నా మీద ఆ క్యారెక్టర్ ఇంకా ఫ్రెష్‌గా ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ చూసే సినిమా ఇది. మదర్-సన్ ఎమోషన్ అద్భుతంగా ఉంటుంది. ఒక కమర్షియల్ సినిమా నుంచి ఏమైతే ఆశిస్తారో అన్నీ ఉన్నాయి. ఫ్యామిలీస్ అందరూ కలిసి హ్యాపీగా చూడొచ్చు. అనిరుధ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గురించి నాని మాట్లాడుతూ..మేము 'జెర్సీ', 'గ్యాంగ్ లీడర్' చేశాం. బిగినింగ్ నుంచి ఎండ్ వరకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో హోల్డ్ చేసి పట్టుకెళ్లే అవకాశం ఈ సినిమాతో వచ్చింది. వందకి రెండింతలు చేశాడు. శ్రీకాంత్-అనిరుధ్ కిల్లర్ కాంబినేషన్. వాళ్ల వల్లే 'ఆయా షేర్', 'ఏషు నాగుల కట్ట' లాంటి సాంగ్స్ సాధ్యమయ్యాయి. శ్రీకాంత్ కథ చెప్పినప్పుడే మోహన్ బాబు గారు అయితే బాగుంటుంది అని అన్నాడు. కాకపోతే ఆయన ఈ క్యారెక్టర్ చేస్తారా లేదా అనేది నాకు డౌట్. ఎందుకంటే చాలా నెగిటివ్, బ్రూటల్ క్యారెక్టర్. శ్రీకాంత్ కథ చెప్పడానికి మోహన్ బాబు గారి దగ్గరికి వెళ్లాడు. ఆయన చాలా ఎక్సైట్‌మెంట్ ఫీల్ అయ్యారు. అది చూసి నేను షాక్ అయ్యాను. ఈ కథ విన్నప్పుడే ఇది చాలా పెద్ద సినిమా అవుతుందని నమ్మిన మొదటి వ్యక్తి మోహన్ బాబు గారు. ఇందులో విలన్‌గా ఆయన చేసే కొన్ని పనులు ఉంటాయి. అవన్నీ చూసి ఆడియన్స్ కచ్చితంగా షాక్ అవుతారని నాని అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

**సినిమాకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్.. టికెట్ ధరల పెంపుకు గ్రీన్ సిగ్నల్**

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ది ప్యారడైజ్ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదలకు ముందే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూవీకి ప్రత్యేక ప్రీమియర్ షో నిర్వహించడంతో పాటు, టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. 'ది ప్యారడైజ్' సినిమాకు సెప్టెంబర్ 23న సాయంత్రం 6:30 గంటలకు ప్రత్యేక ప్రీమియర్ షో నిర్వహించేందుకు అనుమతి లభించింది. ఈ స్పెషల్ షోకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. ఇందులో జీఎస్టీ కూడా కలిపి ఉంటుంది. సినిమా విడుదల రోజు నుంచి సెప్టెంబర్ 27 వరకు టికెట్ ధరలను పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. ఈ కాలంలో మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్‌పై రూ.94, జీఎస్టీతో కలిపి పెంపునకు అనుమతి ఇచ్చారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై రూ.48, జీఎస్టీతో కలిపి పెంచుకోవచ్చు. అలాగే సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు కూడా టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ కాలంలో మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.45, జీఎస్టీతో కలిపి అదనంగా వసూలు చేసుకునేందుకు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.23, జీఎస్టీతో కలిపి పెంచుకునేందుకు అనుమతి లభించింది. టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిబంధనను విధించింది. నిర్మాతలు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.1 కోటి అందించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీంతో 'ది ప్యారడైజ్' విడుదల సందర్భంగా థియేటర్లలో టికెట్ ధరలు పెరగనున్నాయి. ప్రత్యేక ప్రీమియర్ షోకు కూడా అనుమతి రావడంతో సినిమా విడుదలపై ఆసక్తి మరింత పెరిగింది. దసరా లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత శ్రీకాంత్, నాని కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాతో నాని భారీ హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు నాని అభిమానులు.

# పూజిత హ్యాట్రిక్.. ఉత్కంఠ పోరులో అమరావతి 'ఈ' ఛాంపియన్స్ విజయం

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో అమరావతి ఈ ఛాంపియన్స్‌కు రెండో విజయం వరించింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో రాయలసీమ జెన్ స్టార్స్‌పై 7 పరుగుల తేడాతో అమరావతి విజయం సాధించింది. తొలుత అమరావతి 20 ఓవర్లలో 163/4 స్కోరు చేయగా.. అనంతరం లక్ష్య ఛేదనలో రాయలసీమ 156 పరుగులకే పరిమితమైంది. అమరావతి బౌలర్ పూజిత (4/23) హ్యాట్రిక్ సాధించింది. ఆమెతోపాటు దేవిక 3, సాయి దీప్తి, తరిణి తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా పూజిత నిలిచింది.




**అదే కీలక మలుపు**

అమరావతి నిర్దేశించిన 164 పరుగుల లక్ష్య ఛేదనను రాయలసీమ ఘనంగా ప్రారంభించింది. ఓపెనర్లు వేములపాటి సేతు సాయి (20), శుభ శ్రీ (22) తొలి వికెట్‌కు 3.4 ఓవర్లలోనే 39 పరుగులు జోడించారు. తరిణి జోషి ఈ జోడీని విడగొట్టింది. కానీ, వాసవి పావని (16), గ్రీష్మ సైని రెడ్డి (39), శిరీష (20) కూడా విలువైన పరుగులు చేయడంతో రాయలసీమ లక్ష్యం దిశగానే సాగింది. కానీ, పూజిత వేసిన 15వ ఓవర్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. అమరావతి వైపు తిప్పేసింది. హ్యాట్రిక్ వికెట్లతో రాయలసీమను దెబ్బకొట్టింది. దీంతో 123/3తో ఉన్న ఆ జట్టు 125/6కి పడిపోయింది. ఆ తర్వాత దీప్తి, దేవిక వికెట్లు తీయడంతో రాయలసీమ కోలుకోలేకపోయింది. రాయలసీమ బ్యాటర్లలో బారెడ్డి అనూష (12), హేమ రోషిణి (6బి), మాలకొండ పూజిత (4బి), ధాత్రి (3) పరుగులు చేశారు. కీలక సమయంలో అమరావతి ఈ ఛాంపియన్స్ బౌలర్లు రాణించి జట్టును విజయతీరాలకు చేర్చారు.

**రంగ లక్ష్మి హాఫ్ సెంచరీ.. దీక్ష సూపర్ బ్యాటింగ్**

రెండో మ్యాచ్‌లోనూ అమరావతి టాస్ ఓడింది. దీంతో తొలుత బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. గత మ్యాచ్‌లో సెంచరీ సాధించిన రంగ లక్ష్మి ఈసారి కూడా మంచి ఇన్నింగ్స్ ఆడింది. అయితే, ఆరంభంలో ఓపెనర్లు రంగ లక్ష్మి (50: 44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నీరగట్టు అనూష (46: 41 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్) ఆచితూచి ఆడారు. రాయలసీమ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో అమరావతి ఓపెనర్లు రిస్క్ తీసుకోలేదు. అయితే, హాఫ్ సెంచరీ సాధించిన తర్వాత రంగ లక్ష్మి పెవిలియన్‌కు చేరింది. ఆ కాసేపటికే అనూషతోపాటు దేవిక (4) ఔటయ్యారు. కానీ, మరో ఎండ్‌లో ఉన్న కాట్రగడ్డ దీక్ష (48బి: 22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగింది. మహంతి శ్రీ (13బి)తో కలిసి మరో వికెట్ పడనీయకుండా వేగంగా పరుగులు రాబట్టింది. దీంతో అమరావతి స్కోరు 160ం దాటేసింది. రాయలసీమ బౌలర్లలో పద్మజ, అనూష, పూజిత తలో వికెట్ తీశారు.

**అరుదైన ఘనతలు**

తొలిసారి నిర్వహిస్తోన్న మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో ఓ అరుదైన ఘనతను అమరావతి ప్లేయర్లు తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ టోర్నీలో మొదటి సెంచరీ, మొదటి హ్యాట్రిక్‌లు అమరావతి ప్లేయర్లవే. తొలి మ్యాచ్‌లోనే రంగ లక్ష్మి (102) నిన్న సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. ఇవాళ పూజిత (4/23) మొదటి హ్యాట్రిక్ తీసి ఆకట్టుకుంది.

# ఆ సిరీస్‌లో.. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించండి : ఇర్ఫాన్ పఠాన్




వన్డే ప్రపంచ కప్ 2027కు సరిగ్గా ఏడాది సమయం ఉంది. ఈలోగా తక్కువ వన్డే సిరీస్‌లను మాత్రమే భారత్ ఆడనుంది. అందుకే, ప్రతి మ్యాచ్‌ను ఓ పరీక్షగానే భావించాలని టీమ్ఇండియా మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇటువైపు మేనేజ్‌మెంట్ కూడా అలానే తీసుకోవాలన్నాడు. సెప్టెంబర్ 27 నుంచి విండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఆడనుంది. ఈ సిరీస్‌లో భారత రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించాలని ఇర్ఫాన్ తెలిపాడు. "విండీస్‌తో వన్డే సిరీస్‌లో నాకు ఒకే ఒక్క ప్లేయర్ ఆటను వీక్షించాలని ఉంది. అదీనూ అతడికి ఎన్ని మ్యాచుల్లో ఆడే అవకాశం వస్తుందో చూడాలి. అతడే యశస్వి జైస్వాల్. ఈ కుర్రాడిని బ్యాకప్ ఓపెనర్‌గా మేనేజ్‌మెంట్ తీసుకుంది. మరి ఇలాంటి ఆటగాడికీ వచ్చే ఏడాది వరల్డ్ కప్ వెళ్లేనాటికి సరైన అవకాశాలు ఇవ్వాల్సిన అవసరమూ ఉంది. ఎప్పుడు అవకాశం ఉన్నా ఆడించేందుకు ప్రయత్నించాలి. అదెలా చేస్తారనేది మేనేజ్‌మెంట్ పర్యవేక్షించాలి. బ్యాటింగ్ ఆర్డర్ మారుస్తారా? ప్లేయర్లను రొటేట్ చేస్తారా? అనేది మీ ఇష్టం. ఇప్పుడీ విండీస్ సిరీస్‌లో ఒక్క అవకాశమైనా ఇస్తే బాగుంటుందనేది నా అభిప్రాయం" అని ఇర్ఫాన్ వెల్లడించాడు.

**వారు లేకపోయినా..**

"ఇప్పుడు వెస్టిండీస్‌తో ఆడే జట్టు పూర్తిస్థాయి ప్రధాన జట్టు కాదు. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తా. బుమ్రా, శ్రేయస్, అక్షర్, సుందర్.. ఇలాంటి ప్లేయర్లు లేరు. వారంతా ఆసియా గేమ్స్ కోసం వెళ్లారు. వచ్చే వరల్డ్ కప్‌నాటికి కొన్ని మ్యాచులు మాత్రమే ఉంటాయి. అందుకే, బెంచ్‌పై ఉన్న ప్లేయర్లను ఆడించాలి. ఒకేసారి ఆసియా గేమ్స్, వెస్టిండీస్ సిరీస్‌లు రావడం వరంలా భావించాలి. కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వండి" అని ఇర్ఫాన్ సూచించాడు.

### హెర్నీటా హాఫ్ సెంచరీ..

# గోదావరి గోల్డెన్ ఈగల్స్ విజయం



డబ్ల్యూఏపీఎల్‌లో భాగంగా వైజాగ్ ఫైర్ బర్డ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గోదావరి గోల్డెన్ ఈగల్స్ 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. 135 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన వైజాగ్ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులకే పరిమితమైంది. పెండ్యాల సరయు 34, ఆయేషా సింగ్ 34, విశ్వశ్రీ 22 రన్స్ చేశారు. గోదావరి బౌలర్లలో అక్షయ 3 వికెట్లు పడగొట్టింది. విన్నీ సుజన్, సృష్టి శేఖర్, వైష్ణవి తలో వికెట్ తీశారు. అక్షయ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో 3 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 134/9 పరుగులు చేసింది. హెర్నీటా ఫ్లవియా పెరీరా 61బి పరుగులతో సత్తా చాటింది. మిగతా బ్యాటర్లెవరూ అంతగా రాణించలేదు. వైజాగ్ బౌలర్లలో సాయి తన్మయి, రిషిక చెరో 3 వికెట్లు పడగొట్టారు. శర్వాణి, యశస్విని, శరణ్య తలో వికెట్ తీశారు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com